



# అనంతపురం/శ్రీ సత్యసాయి

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

మంగళవారం 22 జులై 2025 పేజీలు : 04


# పోలీసుల బందోబస్తుతో పవర్‌గ్రిడ్ పనులు

- పవర్‌గ్రిడ్ సిబ్బందిపై దాడితో వివాదంగా మారిన జేసీ వ్యవహారం
- జేసీ అనుచరులపై కేసు నమోదుతో ఉద్రిక్తంగా మారిన పరిస్థితి



యాడికి సీఐ ఈరన్న ఆధ్వర్యంలో టవర్ వద్ద బందోబస్తు

**తాడిపత్రి, జులై 21, ప్రభాతవార్త**

యాడికి మండలం రాయలచెరువు సమీపంలో పవర్‌గ్రిడ్ టవర్ల ఏర్పాట్ల పనులు పోలీసు బందోబస్తు మధ్యన సోమవారం పునః ప్రారంభమయ్యాయి. ఈ నెల 16న గుత్తి–తాడిపత్రి జాతీయ రహదారి పక్కన యాడికి అడ్డరోడ్డుకు ఎదురుగా ఉన్న సర్వే నం. 46లో పవర్‌గ్రిడ్ కార్పోరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ ఆధ్వర్యంలో 220 కెవి విద్యుత్తుటవర్ ఏర్పాటు పనులు సాగుతుండగా జేసీ ప్రభాకర్‌రెడ్డి అనుచరులు దాడిచేసి పనులు ఆపినట్లు ఆ సంస్థ అధికారులు కలెక్టర్‌కు, ఎస్పీకి ఫిర్యాదు చేసిన విషయం విదితమే. కార్పోరేటివ్ సోషియల్ రెస్పాన్సిబిలిటీ(సీఎస్ఆర్) కింద తాడిపత్రి ప్రాంత అభివృద్ధికి నిధులు కేటాయించాలని జేసీ అనుచరులు ఆ సంస్థ ప్రతినిధులను డిమాండు చేసినట్లు, దీనిపై ఎలాంటి స్పందన కనబరచకుండా ఆ సంస్థ పనులు కొనసాగిస్తుండటంతో పనులు చేస్తున్న కార్మికులపై దాడికి పాల్పడినట్లు తెలుస్తోంది. ఈ దాడిలో చిన్న వడుగూరుకు చెందిన దివాకర్‌రెడ్డి, యాడికి మాజీ ఎంపీపీ వేలూరు రంగయ్య, క్రిష్టిపాడుకు చెందిన హాజీవలి, నారాయణస్వామి, చౌడయ్యాబాబు తదితరులు 40 మంది పాల్గొన్నట్లు, వీరందరూ కలసి సంఘటనా స్థలంలో పనులు చేస్తున్న కార్మికులపై దాడికి దిగినట్లు, అక్కడి పనులను పర్యవేక్షిస్తున్న ఆ సంస్థ ఉద్యోగి అమిత్‌యాదవ్‌ను అపహరించి, సెల్‌ఫోన్ లాక్కొని అందులో చిత్రీకరించిన దాడి దృశ్యాలను తొలగించి గుత్తి సమీపంలో వదిలిపోయారని ఆ సంస్థ జనరల్ మేనేజర్ హేమంత్‌కుమార్ మానస్ ఏఎస్పీ రోహిత్‌కుమార్ చౌదరికి ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో ఆయన ఆ ఫిర్యాదుపై వెంటనే అవసరమైన చర్యలు తీసుకోవాలని యాడికి సీఐకి ఈరన్నకు సూచించారు. ఫలితంగా ఈ నెల 19న 115(2),121(1),132, 137(2) వంటి తదితర సెక్షన్‌ల కింద ప్రధాన నిందితులతో పాటు మరో 40 మందిపై సీఐ ఈరన్న కేసు నమోదు చేశారు.



టవర్ పనులు పూర్తయ్యేంత వరకు ఏర్పాటుచేసిన పోలీసుల పహారా

కర్నూలు, అనంతపురం జిల్లాల మీదుగా కడప వరకు 100 టవర్ల నిర్మాణం చేపట్టాల్సి ఉందని, తాడిపత్రి ప్రాంత పరిధిలో నెలకొన్న పరిస్థితుల దృష్ట్యా తమ సిబ్బంది, ఇంజినీర్లు పనులు చేయడానికి విముఖత చూపుతున్నారని, ఈ టవర్ల ఏర్పాటు పనులను 2025 సెప్టెంబరులోగా పూర్తి చేయాల్సి ఉందని, పోలీసులు ప్రత్యేక రక్షణ కల్పించకపోతే ఈ జాతీయ స్థాయి సౌరశక్తి విద్యుత్తుత్పత్తికి చెందిన పనులు పూర్తి చేయలేమని జీఎం హెచ్‌కే మానస్ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడం జరిగింది. దీంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సీఐ ఈరన్న ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేసి టవర్ నిర్మాణ పనులను సోమవారం నుంచి పున:ప్రారంభించేలా చర్యలు తీసుకున్నారు.

**ఏఎస్పీపై జేసీ ప్రభాకర్‌రెడ్డి ఆగ్రహం**

ఈ టవర్ నిర్మాణ పనులను పోలీసు బందోబస్తుతో కొనసాగించడం పట్ల, తమ అనుచరులపై కేసు నమోదు చేయడం పట్ల తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి ఏఎస్పీ రోహిత్‌కుమార్ చౌదరిపై సోమవారం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గత డీఎస్పీ చైతన్యతో పోలుస్తూ పవర్‌గ్రిడ్ సంస్థతో ఎంత తిన్నావంటూ ఆరోపించారు. గత ప్రభుత్వ హయాంలో తాము తీవ్రంగా నష్టపోయామని, మా అనుచరులకు,

మాకు న్యాయం చేయగలవా అంటూ ఏఎస్పీని ప్రశ్నించారు. బుధవారం తమ కుటుంబ సభ్యులతో కలసి వచ్చి డీఎస్పీ కార్యాలయం ముంగిట కూర్చుంటామని ఏమి న్యాయం చేస్తావో చేయాలని ఆయన పేర్కొన్నారు.

# సీఎం చంద్రబాబు సారథ్యంలో నీతివంత పాలన...

- గత ప్రభుత్వ పాలనతో 20 సంవత్సరాల అభివృద్ధి వెనక్కి
- జాగ్రత్తగా మసలుకోండి మా ప్రభుత్వానికి సహకారాలు అందించండి : రాష్ట్ర హోంశాఖ మంత్రి అనిత.






బహిరంగ సభలో మాట్లాడుతున్న హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత, బీసీ సంక్షేమ శాఖ మంత్రి సబిత, ఎమ్మెల్యే రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి.

**మడకశిర టౌన్ జూలై 21 ప్రభాతవార్త,**

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సారథ్యంలో నీతివంతన పాలన అందించగలుగుతున్నామని హోం శాఖ మంత్రి అనిత అన్నారు.మడకశిర ఆడబిడ్డను నేను నన్ను ఆశీర్వదించండి అంటూ హోం మంత్రి అనిత పేర్కొన్నారు. సుపరిపాలన లో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా మడకశిర నియోజకవర్గం లోని మడకశిర గుడిబండ మండలాల్లో విస్తృతంగా పర్యటించారు. సోమవారం పట్టణంలోని అమరాపురం బస్టాండులో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో హోం శాఖ మంత్రి అనిత మాట్లాడుతూ: నా గుండె ఉప్పొంగి పోయింది, గుడిబండలోని సుపరి పరిపాలనలో పాల్గొనడానికి వెళ్లినప్పుడు ప్రతి ఇంట మహిళలు వచ్చి హారతి లిచ్చి పసుపు కుంకుమ పెట్టి ఆశీర్వదించడం చూస్తే ఎంతో ఉద్వేగానికి లోనయ్యానన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వానికి 164 సీట్లు వచ్చిన బాధ్యతతో పనిచేయాలని పేర్కొన్న నాయకుడు ముఖ్యమంత్రి చంద్రబాబు అని కొనియాడారు. ప్రజల కష్ట సుఖాలు తెలుసుకోవడానికి సూపరిపాలనలో ప్రతి ఇంటి గడప తొక్కి వారి కష్ట సుఖాలను తెలుసు కొంటున్నామన్నారు. పెన్షన్లు, తల్లికి వందనం తదితర పథకాలు అందుతున్నాయా లేదా అని తెలుసుకోవాలని ముఖ్యమంత్రి ఈ కార్యక్రమం చేపట్టి ప్రజల వద్దకు వెళుతున్నామని ఆమె పేర్కొన్నారు. గత వైకాపా ప్రభుత్వ పాలన లో అరాచక పాలన ద్వారా 20 సంవత్సరాలు వెనక్కి రాష్ట్ర అభివృద్ధి వెళ్లిందని ఆమె ఆరోపించారు. గత వైసిపి ప్రభుత్వంలో జగన్మోహన్ రెడ్డి, వారి ఎమ్మెల్యేలతో పాటు రాష్ట్రంలో అరాచకాలు జరిగితే తాము నేడు మహిళా సంక్షేమమే కర్తవ్యంగా పని చేస్తున్నామని ఆమె పేర్కొన్నారు. మరో మారు మాయమాటలతో మీ ముందుకు ప్రతిపక్ష నేత మాయలమారి జగన్ వస్తాడని మీరు జాగ్రత్తగా మసులుకోవాలని కూడా ఆమె కార్యకర్తలకు సూచించారు. గతంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు.నారా లోకేష్. పవన్ కళ్యాణ్ లు పడ్డ అవమానాలు రాష్ట్రంలో ఎవరూ పడలేదని అలాంటి వారే ఎంతో సంయమనంతో కలిసి పనిచేస్తూ కూటమి ప్రభుత్వం ఇలాగే 15 సంవత్సరాలు కలిసి పని చేయాలని నిర్ణయించడం చూస్తే మన బాధ్యత ఎంతో అర్థమవుతుందని ఆమె కార్యకర్తలకు తెలియజేశారు. ఉద్యమ నేత ఎమ్మెస్ రాజు ఎమ్మెల్యేగా ఎన్నికైన తర్వాత ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు మీ నియోజకవర్గంలో చేపడుతూ ఉండడం ఎంతగానో అభినందించదగ్గ విషయం అన్నారు నమ్మితే ప్రాణమిచ్చే మడకశిర ప్రజల కోసం ఎంతగానో కష్టపడుతున్నదని పేర్కొన్నారు. ఇండియన్ గవర్నమెంట్ పరిశ్రమను ప్రారంభించడం ద్వారా మూడు వేల మందికి ఉపాధి అవకాశాలు కల్పించారని ఇది కదా నాయకత్వం అంటే అని ఆమె పేర్కొన్నారు . బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవితమ్మ మాట్లాడుతూ :పెన్షన్ అంటేనే ఎన్టీ రామారావు గుర్తుకొస్తారని గుర్తు చేశారు అదే పెన్షన్ ను వెయ్యి నుంచి రెండు వేలకు నేడు 3,000 నుండి 4,000 పెంచిన ఘనత చంద్రబాబుదని ఆమె పేర్కొన్నారు మీ నియోజకవర్గ ఎమ్మెల్యే ప్రతి మంత్రి వద్ద కలిసినప్పుడు ఆయా శాఖలకు సంబంధించిన పనులు చేయాలని అడుగుతూ నిధులు సమీకరిస్తూ మడకశిర నియోజకవర్గాన్ని అభివృద్ధి ప్రయాణంలో పయనింప చేయడం మీరు చేసుకున్న భాగ్యంగా పేర్కొన్నారు.



బహిరంగ సభకు హాజరైన నాయకులు,కార్యకర్తలు,మహిళలు, ప్రజలు.

**ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు మాట్లాడుతూ:**

గత వైసిపి ప్రభుత్వంలో నియోజకవర్గంలో అవినీతి అక్రమాలు పేర్కొపోయాయని తన హయాంలో ఒక్క రూపాయి అవినీతి జరిగిన ఇక్కడ నుంచి వెనుతిరిగి మడకశిర నుండి వెళ్ళిపోతానని కార్యకర్తలను ఉద్దేశించి ఆయన హామీ ఇచ్చారు. ఈ నియోజకవర్గ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేస్తూ అభివృద్ధి చేయడమే తన లక్ష్యంగా పేర్కొన్నారు. సుపరిపాలనలో రాష్ట్రంలోనే పదవ స్థానంలో చోటు దక్కించుకున్న నేపథ్యంలో ప్రతి కార్యకర్తకు శిరస్సు వంచి నమస్కరిస్తున్నానని ఆయన వినయ పూర్వకంగా నమస్కరించారు. హోం మంత్రి అనిత వైకాపా ప్రభుత్వంలో అనేక ఇబ్బందులకు గురి అయినప్పటికీ తను ధైర్యంగా ప్రజల కోసం గత ప్రభుత్వా అన్యాయాలను ఎదిరిస్తూ పోరాట వీర వనితిగా నిలవడం వల్లనే నేడు హోం మంత్రిగా సముచిత స్థానం ముఖ్యమంత్రి చంద్రబాబు కల్పించారని పేర్కొన్నారు. కష్ట నష్టాలకు ఎదురొడ్డి నిలిచిన వారిని ముఖ్యమంత్రి గుర్తిస్తాడు అనేదానికి ఇదే నిదర్శనం అని కూడా పేర్కొన్నారు. నారా లోకేష్ ను అసమర్థుడుగా చిత్రీకరించే కుట్ర జరిగినప్పటికీ ధైర్యంగా ఎక్కడ ఓడాడు అక్కడే నెగ్గి తన సమర్థత ఏంటో తెలియజేయడమే కాకుండా నేడు ప్రతిపక్ష గుండెల్లో అవినీతి అక్రమాలను ఛేదించే సింహస్వప్నమని పేర్కొన్నారు. నియోజకవర్గంలో 2,000 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి ద్వారా రైతాంగానికి ఎకరాకు 31 వేల రూపాయలు ఆదాయం వచ్చే విధంగా చర్యలు చేపట్టామని ఆయన పేర్కొన్నారు . మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి మాట్లాడుతూ: పార్టీ కార్యకర్తలు అందరూ కష్టపడి సుపరిపాలన కార్యక్రమాన్ని దిగ్విజయం చేశారని అదే స్ఫూర్తితో కలిసి ముందుకు నడవాలని కూడా ఆయన కార్యకర్తలకు పిలుపునిచ్చారు. అదేవిధంగా నియోజకవర్గంలో అసంపూర్తిగా ఉన్న అభివృద్ధి కార్యక్రమాల్ని పూర్తి చేసే విధంగా ముందుకు వెళ్లాలన్నారు. ఈ బహిరంగ సభకు హాజరైన జిల్లా అధ్యక్షులు అంజినప్ప, జిల్లా డిసిసి బ్యాంక్ చైర్మన్ కేశవరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్ మూర్తి, కార్యనిర్వాహక కార్యదర్శి రాధాకృష్ణ, మున్సిపల్ చైర్మన్ నరసింహ రాజు, జిల్లా మైనార్టీ అధ్యక్షుడు భక్తర్, ఐదు మండలాల కన్వీనర్లు, కౌన్సిలర్లు, సింగల్ విండో అధ్యక్షులు, మార్కెటడ్ చైర్మన్,డైరెక్టర్లు, నాయకులు,కార్యకర్తలు,మహిళలు తదితరులు పాల్గొన్నారు,

# ఏఎస్పీ కార్యాలయం ఎదుట ధర్నాకు జేసీ సిద్ధం

- ఏఎస్పీపై చిందులు తొక్కిన జేసీ ప్రభాకర్‌రెడ్డి
- ఎస్పీ అయినా, ఏఎస్పీ అయినా ఏమీచేయలేరంటూ ఆగ్రహం.



ఆగ్రహం వ్యక్తం చేస్తున్న జేసీ ప్రభాకర్‌రెడ్డి

**అనంతపురం, జులై 21, ప్రభాతవార్త బ్యూరో**

తాడిపత్రి నియోజకవర్గం యాడికి మండల పరిధిలో పోలీసు బందోబస్తు మధ్య పవర్‌గ్రిడ్ టవర్ల ఏర్పాటుకు ఏఎస్పీ రోహిత్‌కుమార్ చౌదరి చర్యలు తీసుకోవడాన్ని నిరసిస్తూ బుధవారం ఏఎస్పీ కార్యాలయం ఎదుట ధర్నాకు సిద్ధపడినట్లు మాజీ ఎమ్మెల్యే, మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి సోమవారం సామాజిక మాధ్యమాల ద్వారా తెలిపారు. టవర్ ఏర్పాట్లకు భూములిచ్చిన రైతులు నష్టపోయారని, వారితో పెద్దఎత్తున తరలివచ్చి నిరసన తెలుపుతామని, చేతనైతే అడ్డుకోవాలంటూ ఏఎస్పీకి జేసీ సవాల్ విసిరారు. గతంలో ఇక్కడ డీఎస్పీగా పనిచేసిన చైతన్యే నీకంటే మేలని, నీవు వచ్చీరాగానే మొదలు పెట్టావని, పవర్‌గ్రిడ్ వాళ్లతో ఎంత నొక్కావని ఏఎస్పీని ఉద్దేశించి మాట్లాడారు. గత అయిదేళ్లలో తాము తీవ్రంగా నష్టపోయామని, ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నామని మా కష్టాలు నీవు తీరుస్తావా, వాటన్నింటికీ సమాధానాలు చెప్పాలని జేసీ పేర్కొన్నారు. పోలీసు బందోబస్తుతో టవర్ నిర్మాణ పనులు చేపడతావా, మా అనుచరులపై కేసు నమోదు చేయిస్తావా అంటూ ఏఎస్పీపై ఊగిపోయారు. మా దగ్గర అన్ని జీవోలు ఉన్నాయని, నీవు ఫిర్యాదు చేస్తే మేము ఫిర్యాదు చేస్తామని, నీ మీద కేసు కూడా పెడతామని ఏఎస్పీని ఉద్దేశించి హెచ్చరించారు. తన భార్య, కోడలుతో ఏఎస్పీ కార్యాలయం వద్దకు బుధవారం ఉదయం వచ్చి కూర్చుంటామని, ఏఎస్పీ సమాధానం చెప్పాలని ఆయన డిమాండు చేశారు. ఈ నెల 18న జరిగిన సంఘటనకు ఏఎస్పీనే కారణమని, అందులో కూడా మా అనుచరులపై కేసు నమోదు చేయడం ఏమిటని జేసీ ఏఎస్పీపై తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తం చేశారు.

# ముసుగులో ఉన్న రాజకీయ నేరస్థుడు జగన్

- హోమ్ మినిస్టర్ అనిత



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న హోమ్ మినిస్టర్ వంగలపూడి అనిత

**మడకశిర టౌన్ జూలై 21 ప్రభాతవార్త.**

ముసుగులో ఉన్న రాజకీయ నేరస్థుడు జగన్మోహన్ రెడ్డి అని హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత విమర్శించారు. మడకశిర పట్టణం లో ఎమ్మెల్యే రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి లతో కలిసి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశంలో హోం మినిస్టర్ వంగ లపూడి అనిత మాట్లాడుతూ: రాష్ట్ర కూటమి ప్రభుత్వం ఏ ఒక్కరి పైన తప్పుడు కేసులు పెట్టలేదని. తప్పు చేసిన వారి పైనే కేసులు పెడుతున్నామన్నారు ఎంపీ మిథున్ రెడ్డిని కూడా చట్ట పరిధిలోనే అరెస్ట్ చేశామన్నారు.మిథున్ రెడ్డి అరెస్ట్ అక్రమ సక్రమ అనేది కోర్టు తెలుస్తుంది అన్నారు గత ప్రభుత్వం మాదిరి కక్ష సాధింపులు చేయడం లేదని, ప్రభుత్వం ఏర్పడి సంవత్సరంలోపే ప్రజల్లోకి ధైర్యంగా తిరుగుతున్నామన్నా రు. చేసిన మంచిని చెప్పుకోవడానికి సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. రాయలసీమను ప్రపంచవైపు చూసే విధంగా కూటమి ప్రభుత్వం పరిశ్రమలు తీసుకువస్తుంది అన్నారు. అందులో భాగంగానే మడకశిరకు 2,700 కోట్లతో డిఫెన్స్ పరిశ్రమను ఈ ప్రాంతంలో 7,000 కోట్లతో 2,000 మెగా వాట్లు సోలార్ ఏర్పాటు చేసేందుకు సిద్ధంగా ఉందన్నారు. రైతుల నుండి భూములు కూడా స్వీకరించడం ప్రారంభించింది అన్నారు. రాష్ట్రంలో గంజాయి సాగు పూర్తిగా తగ్గిపోయింది అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా లక్ష పైగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేందుకు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గానికి రెండు డ్రోన్ కెమెరాలు అందించే ఆలోచనలో ప్రభుత్వం ఉందన్నారు సినిమాలు సీరియల్ లో అధికంగా హింసను ప్రేరేపించే విధంగా చూపిస్తున్నారు. దీనిపై మేధోమదం జరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరికి సామాజిక స్పృహ అవసరమన్నారు. జిల్లాకు హంద్రీనీవా ద్వారా సాగునీరు త్రాగునీరు ఇచ్చామన్నారు 11 మందిని ఇచ్చి జగన్కు ఇంటికి పంపించిన ఇంకా బుద్ధి రాలేదు అన్నారు ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలను తీర్చిదిద్దుతున్నారు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ అని కొనియాడారు, గత ప్రభుత్వంలో నాడు నేడు ద్వారా పైన పటారం లోన లొటారం ల రంగులు వేసి నిధులు దోచుకున్నారు అన్నారు, టిడిపి జిల్లా అధ్యక్షులు అంజనప్ప. రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్ మూర్తి. కార్య నిర్వాహక కార్యదర్శి రాధాకృష్ణ. మున్సిపల్ చైర్మన్ నరసింహ రాజు. జిల్లా మైనార్టీ అధ్యక్షుడు భక్తర్. మండల కన్వీనర్లు. కౌన్సిలర్లు వైస్ చైర్మన్ లు వెంకట లక్ష్మమ్మ. ప్రభావతి. ఉమా శంకర్.శ్రీనివాసులు. సుభద్ర నాగేంద్ర. విక్రమ్. మేఘన రమేష్.కార్యదర్శి తిమ్మరాజు. నాయకులు. కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## సబ్ జూనియర్, జూనియర్ ఆక్వాటిక్ ఛాంపియన్షిప్ పోటీలలో

# అనంతపురం జిల్లా క్రీడాకారుల ప్రతిభ



ఆక్వాటిక్ ఛాంపియన్ షిప్ పోటీలలో పతకాలు సాధించిన క్రీడాకారులు

**అనంతపురం, జులై 21 ప్రభాతవార్త బ్యూరో**

రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన జూనియర్ సబ్ జూనియర్, జూనియర్ ఆక్వాటిక్ ఛాంపియన్‌షిప్ పోటీలలో అనంతపురంకు చెందిన ఈత క్రీడాకారులు వారి ప్రతిభ చాటి అందరి మన్ననలను పొందారు. వివరాల మేరకు.. ఈ నెల 19, 20వ తేదీలలో విశాఖపట్నంలో జరిగిన సబ్ జూనియర్, జూనియర్ ఆక్వాటిక్ ఛాంపియన్షిప్ పోటీలలో అనంతపురం జిల్లాకు చెందిన ఈత క్రీడాకారులు 5 స్వర్ణం, 2 రజతం, 3 కాంస్య పతకాలను గెలుచుకొని రాష్ట్రంలో 7వ స్థానంలో నిలిచారు. ఈ పోటీలలో గ్రూప్–1 క్రీడాకారుడు ఎస్. కార్తికేయ 5 స్వర్ణ పతకాలను గెలుచుకోవడమే కాకుండా వ్యక్తిగత ఛాంపియన్షిప్ కైవసం చేసుకొని తన సత్తాను చాటుకున్నాడు. గ్రూప్–1 యస్.కార్తికేయ 50 మీటర్లు బ్యాక్ స్ట్రోక్ స్వర్ణం 00:29:85 సెకండ్స్, 100 మీటర్లు బ్యాక్ స్ట్రోక్ స్వర్ణం 01:06:10, 200 మీటర్లు బ్యాక్ స్ట్రోక్ స్వర్ణం 02:26:52, 100మీటర్లు ఫ్రీస్టయిల్ స్వర్ణం 00:58:30 సెకండ్స్, 200 మీటర్లు ఫ్రీస్టయిల్ స్వర్ణం 02:07:67, పి.అకుల్‌సాయి, 100మీటర్లు బ్యాక్ స్ట్రోక్ కాంస్యం 01:21:57, 200మీటర్లు బ్యాక్ స్ట్రోక్ కాంస్యం 03:00:29, గ్రూప్–2 ఎమ్.ఎస్.ఎస్.జస్విన్ నాయుడు 100మీటర్లు బ్యాక్ స్ట్రోక్ రజతం 01:16:05, 200మీటర్లు బ్యాక్ స్ట్రోక్ రజతం 02:54:01, 50మీటర్లు బ్యాక్ స్ట్రోక్ కాంస్యం 00:34:84, పతకాలను గెలుచుకున్న ఈత క్రీడాకారులను జిల్లా ఈత సంఘం అధ్యక్షులు కామని రవిశేఖర్ రెడ్డి, కార్యదర్శి రాజశేఖర్, ఉపాధ్యక్షులు వెంకట రెడ్డిలు అభినందించారు.

# మద్యం కుంభకోణానికి సూత్రదారి ఎంపి మిథున్‌రెడ్డి

- మూల విరాట్ వైఎస్.జగన్
- మీడియా సమావేశంలో ఎమ్మెల్యే కందికుంట



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్

**కదిరి, జులై 21 ప్రభాతవార్త**

మద్యం కుంభకోణానికి సూత్రదారి ఎంపి మిథున్‌రెడ్డి మూల విరాట్ వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ ఆరోపించారు. సోమవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మద్యం కుంభకోణం అనేది అధికారం మారిన తర్వాత కాదు జగన్‌మోహన్‌రెడ్డి మీరు అధికారంలో ఉన్నప్పుడే మద్యం కుంభకోణం జరిగిందని, ఇదే విషయాన్ని గతంలో బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలుగా పురందేశ్వరి దేశ ప్రధాని నరేంద్ర మోదీ దృష్టికి తీసుకెళ్లిందని, అప్పటి ప్రతిపక్షనేత, ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నగదు వ్యవహారాల్లో తేడా వస్తోందని పలు వేదికలలో ప్రశ్నించారని గుర్తు చేశారు. అయితే అధికారాన్ని అడ్డం పెట్టుకుని విచారణ జరగకుండా జగన్‌మోహన్‌రెడ్డి అడ్డుకున్నారని ఆరోపించారు. ప్రభుత్వం మారిన తర్వాత మీరు చేసిన కుంభకోణం బయటపడిందని మిథున్‌రెడ్డి అరెస్టుకు వచ్చే సరికి జగన్‌లో ఉలిక్కిపాటు తత్రపాటు మొదలైందన్నారు. సత్యప్రసాద్ అప ఐఎస్ ఆఫీసర్‌కు పదోన్నతి ఆశ చూపి మద్యం కుంభ కోణానికి మిథున్‌రెడ్డి తెరలేపారన్నారు. జగన్‌మోహన్, సజ్జల రామకృష్ణరెడ్డి, విజయ్‌సాయిరెడ్డి, కసిరెడ్డి రాజిరెడ్డి, సజ్జల శ్రీధర్‌రెడ్డి ముఠాగా ఏర్పడి మద్యం కుంభకోణానికి తెరలేపారన్నారు. మిథున్‌రెడ్డి అరెస్టు సందర్భంగా బ్లాక్‌డేగా ప్రకటించడం, వైఎస్.జగన్ సిగ్గుతో తలదించుకోవాలన్నారు. 3500 కోట్ల మద్యం కుంభకోణంలో పూర్తి స్థాయిలో విచారణ జరిగిన తర్వాతనే న్యాయస్థానం మిథున్‌రెడ్డికి బెయిల్ నిరాకరించిందన్నారు. కొత్తగా ఏర్పాటు చేసిన వివిధ షెల్ కంపెనీల ద్వారా ముడుపులు వైసిపి నాయకులకు అందాయన్నారు. పిఎల్ఆర్ ప్రాజెక్టు, బికాట్ కంపెనీ నుంచి నగదు లూటీ జరుగుతూ వచ్చిందన్నారు. 20 సంవత్సరాల క్రితం మిథున్‌రెడ్డి గుంతకల్లు రైల్వే టెండర్‌లో చొక్కాలు చింపుకుని కొట్టుకుఆన్నరని, అటువంటి వ్యక్తికి దుబాయ్, ఆఫ్రికా దేశాల్లో మైనింగ్ పెట్టుబడి పెట్టేందుకు డబ్బులు ఎక్కడ నుంచి వచ్చాయని ఎమ్మెల్యే నిలదీశారు. మిథున్ అరెస్టు కూటమి ప్రభుత్వం కక్షసాధింపు కాదని ఆయన అరెస్టు ఏ రకంగా చూసినా అక్రమ అరెస్టు కాదన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కక్షసాధింపులు చేయాలనుకుంటే సంవత్సరం లోపే వైసిపి నాయకులు కనుచూపు మేరలో కనిపించకుండా కనుమరుగయ్యేవారన్నారు. ప్రజలకు ఇచ్చిన ఇచ్చిన బాధ్యత నెరవేర్చే క్రమంలోనే తమ ఆలోచన విధానం ఉంటుందని, వైసిపి నాయకులను భయపెట్టి అక్రమ అరెస్టులు బనాయించాలన్న ఆలోచన తమకు లేదన్నారు. మద్యం కుంభకోణంలో జరగబోయే రోజుల్లో అంతిమంగా జగన్, ఆయన కుటుంబ సభ్యులే అన్నారు. మిథున్‌రెడ్డి రిమాండ్ రిపోర్టు చూస్తే షాకింగ్ విషయాలు బయటికి వచ్చాయని, దేశ సంపద ఐఐటిలో చదువుకున్న వారితో బోగస్ కంపెనీలు పెట్టించి ప్రకటనలు ఇచ్చి, షెల్ కంపెనీలు ఏర్పాటు చేసి డబ్బులు దండుకునేందుకు ఉద్యోగ కల్పన చేశారన్నారు. మిథున్‌రెడ్డి విచారణకు సహకరించాలని తప్పు చేయకపోతే కడిగిన ముత్యంలా బయటికి రావచ్చన్నారు. ఎంతటివారైనా తప్పు చేస్తే న్యాయస్థానాల్లో శిక్ష అనుభవించక తప్పదని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.

"భగవా" దానిమ్మ భలే దిగుబడి..!!

అపహాస్యం..సర్వసభ్య సమావేశం..!

నియోజకవర్గ అభివృద్ధే మన లక్ష్యంగా ముందుకు సాగుతున్నాం

4 >>

02ATP27_02ATP27.qxd 21-07-2025 PM 10:16 Page 1



# కళ్యాణదుర్గం ఆర్డీవో కార్యాలయంలో పిజిఆర్ఎస్ కార్యక్రమం

**కళ్యాణదుర్గం, టౌన్ జూలై,21, ప్రభాతవార్త**



ప్రజల వద్ద నుంచి అర్జీలు స్వీకరిస్తున్న ఆర్డీవో వసంత బాబు

కళ్యాణదుర్గం పట్టణంలోని రెవెన్యూ డివిజనల్ కార్యాలయం నందు సోమవారం ఆర్డీవో వసంత బాబు ఆధ్వర్యంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల వద్ద నుంచి 11 అర్జీలను ఆర్డీఓ స్వీకరించారు . ఆయన మాట్లాడుతూ పి జి ఆర్ ఎస్ ద్వారా ప్రజలు ఇచ్చిన అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆర్డీవో ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అధికారులు ,ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ఆర్టీసీ యూనియన్ ఉద్యోగుల సమావేశం

**కళ్యాణదుర్గం టౌన్, జూలై 21, ప్రభాతవార్త**



నూతనంగా ఎన్నికైన డిపో యూనియన్ సభ్యులను సన్మానిస్తున్న దృశ్యం

ఆర్టీసీ ఉద్యోగుల యూనియన్ జనరల్ బాడీ సమావేశం కళ్యాణ దుర్గం పట్టణంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రీజనల్ ప్రెసిడెంట్ విజయ భాస్కర్ రెడ్డి, రీజనల్ కార్యదర్శి ఖాన్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ప్రధానంగా వారు సమావేశంలో ఆర్టీసీ డిపోలోని సమస్యలపై చర్చించారు. నూతన డిపో కమిటీలో భాగంగా హిప్పో ప్రెసిడెంట్ గా వేణుగోపాల్ , డిపో వర్కింగ్ ప్రెసిడెంట్ గా జేసీ వెంకటేశులు, డిపో ఉపాధ్యక్షులుగా ఎం కదిరప్ప, నూతన డిపో కార్యదర్శిగా హెచ్ గంగప్ప , సహాయ కార్యదర్శిగా ఎం హెచ్ రాయుడు, కోశాధికారి గా దినేష్, గ్యారేజ్ సెక్రెటరీ గా నాగరాజు, ప్రచార కార్యదర్శిగా ఎమ్మెస్ రాయుడు లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మిగతా కమిటీ సభ్యులను త్వరలోనే నియమిస్తామని తెలిపారు.

# దేవర దున్నపోతు దాడిలో మహిళ మృతి

**బ్రహ్మసముద్రం జూలై 21 ప్రభాతవార్త**

మండలంలోని కోనాపురం గ్రామంలో ఆదివారం సాయంత్రం దున్నపోతు దాడిలో మహిళా చనిపోయిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది కోనాపురం గ్రామానికి చెందిన పార్వతమ్మ 55 తన వ్యవసాయ పొలంలో పనుల కోసం వెళ్లిన పార్వతమ్మను అక్కడే ఉన్న దేవర దున్నపోతు దాడి చేసింది పార్వతమ్మ అక్కడికక్కడే చనిపోయినట్టు పోలీసులు తెలిపారు బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు.

## కొలగనహళ్లి పంచాయతీ పరిధిలో జూలై 7న దాడిలో పాల్గొన్న మిగిలిన పదిమంది అరెస్ట్ -సిఐ వెంకటరమణ.

**బొమ్మనహాళ్ జూలై 21 ప్రభాతవార్త:**



అరెస్టు చూపుతున్న పోలీసులు

బొమ్మనహాళ్ మండలం కొలగ నహళ్లి పంచాయతీ పరిధిలో కొలగానహళ్లి గ్రామానికి చెంది న అనంతరాజు మైలాపురం గ్రామానికి చెందిన ఒక మహిళతో పెట్టు కున్న వివాహే తర సంబంధం వలన మైలాపు రం గ్రామంలో జూలై7న జరిగిన గొడవల్లో రెండు వర్గాలపై హత్యయత్నము కేసుల దర్యాప్తు లో భాగంగా ఈరోజు దాడిలో పాల్గొన్న మిగిలిన 10 మందిని అరెస్ట్ చేసి వారిని అందరినీ రాయదుర్గం కోర్టు లో హాజరు పరచడం అయినది. అని బొమ్మనహాల్ సబ్ ఇన్స్పెక్టర్ నబి రసూల్ తెలియజేశారు. మరియు ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ హెచ్చరి క:ప్రజలు గమనించాలి తెలుసుకోవాలి. ఇతరులవలన మనకు ఏదైనా అన్యాయం/హాని జరిగితే మనం తిరిగి వారిపై దాడి చేయడం లాంటివి చేయకూడదు. చట్ట బద్ధమైన పద్ధతులు మాత్రమే అవలంబించాలి. చట్టాని చేతులలోకి తీసుకునే వారిని అరెస్ట్ చేయడం జరుగుతుంది.ప్రజలకు ఏదైనా ఇబ్బందులు వస్తె 100 నంబరికి ఫోన్ చేసి తెలపడం వల్ల వెంటనే పోలీసులు సంఘటన స్థలానికి వచ్చి మీకు సహాయం చేయడానికి ముందుకు వస్తారు. పోలీస్ సేవలు వినియోగించుకోవాల్సిందిగా మనవిచేశారు.

# బాలయ్య చేసిన అభివృద్ధి వైకాపా నేతలకు కనబడలేదా

**-ఎమ్మెల్యేపై అసత్య ఆరోపణలు చేస్తే ఖబడ్దార్-హిందూపురం అభివృద్ధిపై బాలయ్య చూపు -విలేకరుల సమావేశంలో టిడిపి నాయకులు ఎద్దేవా**

**లేపాక్షి, జూలై 21 ప్రభాతవార్త**

హిందూపురం నియోజకవర్గంలో ఏడాది కాలంలో కోట్లాది రూపాయలతో అన్ని గ్రామాల్లో ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ అభివృద్ధి పనులు చేయడం జరిగిందని ఆ పనులు వైకాపా నేతల కంటికి కనిపించలేదా అని టిడిపి నాయకులు పేర్కొన్నారు. వైకాపా నేతలు చేసిన విమర్శలకు స్పందించిన టిడిపి నాయకులు సోమవారం స్థానిక ఆర్జెహెచ్ ఫంక్షన్ హాల్లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా టిడిపి మండల కన్వీనర్ అభిలాష్, మాజీ ఎంపిపి ఆనంద్‌కుమార్, కొండూరు సర్పంచు సిద్ధార్థ్, సిరివరం కిష్టప్ప, మారుతిప్రసాద్, రామాంజనమ్మ, సూర్యప్రకాష్, వీరశేఖర్‌లు మాట్లాడుతూ వైకాపా పాలనలో వ్యవస్థలన్నింటిని సర్వనాశనం చేశారన్నారు. గత ఐదేళ్ల వైకాపా పాలనలలో అభివృద్ధి శూన్యమన్నారు. ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలోనే తల్లికి వందనం ఒక్కొక్కటిగా అమలు చేయడం జరిగిందన్నారు. తల్లుల ఖాతాలకు ప్రతి విద్యార్థికి 15 వేలు జమ చేయడం జరిగిందన్నారు. ఆగస్టు నుండి మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తామన్నారు. లేపాక్షి మండలాన్ని భవిష్యత్తులో పారిశ్రామికంగా తీర్చిదిద్దడం జరుగుతుందన్నారు. ఎమ్మెల్యే బాలకృష్ణ తన సొంత నిధుల నుండి విద్య, వైద్యాన్ని ప్రజలకు అందిస్తున్నారన్నారు. మద్యం కేసులో అరెస్ట్ అయిన ఎంపి మిథున్‌రెడ్డి వైకాపాలో కోట్లాది రూపాయలు సొంత ఖాతాలకు మళ్లించుకున్నారన్నారు. అవినీతి, అక్రమాలు, దౌర్జన్యాలు చేయడం మిథున్‌రెడ్డికి వెన్నతో పెట్టిన విద్య అన్నారు. వైకాపాలో ఎన్ని తప్పులు చేసిన నాయకులను వదిలి, ప్రజా సేవ చేస్తున్న వారిపై విమర్శలు గుప్పించడం సిగ్గుచేటని పేర్కొన్నారు. తెలుగు మాట్లాడడానికిరాని దీపికమ్మను ఆంధ్రప్రదేశ్‌రాష్ట్రంలో హిందూపురం నియోజకవర్గం వర్గానికి వైకాపాఇన్‌చార్జ్‌గా చేయడం హాస్యాస్పదంగా వుంద న్నారు. నిజానిజాలు తెలుసుకొని మాట్లాడకపోతే భవిష్యత్తులో తీవ్ర పరిణా మాలు ఎదుర్కోవాల్సి వస్తుందని దీపికవేణురెడ్డిలను టిడిపి నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి గంగాధర్, కొండూరు ప్రభాకర్‌రెడ్డి, పులమతి అశ్వత్థ, డైరీ శ్రీరామప్ప, కొండూరు శ్రీరాములు, అంగడి అంజి, డిష్ మంజు, గోవిందు, సిరివరం అనిల్, మండల తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న టిడిపి నాయకులు

# విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తిపై కేసు

## 14 రోజులు రిమాండ్

**హిందూపురం టౌన్ జూలై 21 ప్రభాతవార్త**

పోలీసుల విధులకు ఆటంకం కలిగించడంతో హిందూపురం పట్టణం రహమత్పురంకు చెందిన మహమ్మద్ ఇర్ఫాన్ అనే వ్యక్తి పై కేసు నమోదు చేసి 14 రోజులు రిమాండ్ విధించినట్లు రెండవ పట్టణ సీఐ కరీం తెలిపారు. మహమ్మద్ ఇర్ఫాన్ అనే వ్యక్తి ఆదివారం రాత్రి మద్యం సేవించి విధుల్లో ఉన్న పోలీసు సిబ్బంది పట్ల అసభ్యంగా ప్రవర్తించి, విధులకు ఆటంకం కలిగించడంపై రెండవ పట్టణ పోలీస్ స్టేషన్లో కేసు నమోదు అయింది. ఈ కేసులో మహమ్మద్ ఇర్ఫాన్ ను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచుగా న్యాయస్థానం అతనికి 14 రోజులు రిమాండ్ విధించినట్లు సీఐ తెలిపారు. అంతేకాకుండా అతనిపై రౌడీషీట్ ఓపెన్ చేయడం జరిగిందని భవిష్యత్తులో కూడా ఇతని కార్యకలాపాలపై నిఘా ఉంచుతామని తెలిపారు. విధుల్లో ఉన్న పోలీసు సిబ్బంది పట్ల ఎవరైనా దొరుకుగా ప్రవర్తించిన విధులకు ఆటంకం కలిగించిన నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన వారిపై పోలీసు శాఖపరంగా కఠినమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని సిఐ కరీం హెచ్చరించారు. పోలీసులు ప్రజల రక్షణ కోసం నిరంతరం కృషి చేసే వారిని ప్రజలు గుర్తించాలని కోరారు.

# దెయ్యం ప్రచారం అవాస్తవం

## హిందూపురం డీఎస్పీ మహేష్

**హిందూపురం టౌన్ జూలై 21 ప్రభాతవార్త**

పట్టణంలోని మోడల్ కాలనీ ఆర్టీవో కార్యాలయం సమీపంలోని అండర్ బ్రిడ్జి వద్ద దెయ్యం సంచరిస్తూ కొంత మంది వ్యక్తులపై దాడి చేసింది అంటూ సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారం పూర్తిగా అవాస్తవమని హిందూపురం డీఎస్పీ మహేష్ అన్నారు. ఇంత వరకు అలాంటి ఫిర్యాదు ఏమి అందలేదని తెలిపారు. సోషల్ మీడియాలో దుష్ప్రచారాలు చేస్తూ ప్రజలను భయాందోళనకు గురి చేసే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పోలీసు సిబ్బంది రాత్రి వేళల్లో గస్తీ కాస్తుంటారని ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని డీఎస్పీ మహేష్ తెలిపారు.

# జెసి ప్రభాకర్‌రెడ్డి తీరుపట్ల కలెక్టర్‌కు ఫిర్యాదు



కలెక్టర్కు వినతిపత్రం సమర్పిస్తున్న పంచాయతీ రాజ్ శాఖ ఉద్యోగులు

**పుట్టపర్తి, జూలై 21, ప్రభాతవార్త**

అనంతపురం జిల్లా తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జెసి ప్రభాకర్ రెడ్డి ఉమ్మడి జిల్లా డిపిఓ నాగరాజు నాయుడుపై గత గురువారం రోజున పరుష పదజాలంతో మాటల దాడి చేయడాన్ని ఖండిస్తూ జిల్లా ఎంపీడీవోల సంఘం నాయకులు జిల్లా కలెక్టర్ టీ.ఎస్. చేతన్ కు వినతిపత్రం సమర్పించారు. జెసి ప్రభాకర్ రెడ్డి ప్రవర్తించిన తీరు పంచాయతీరాజ్ శాఖ ఉద్యోగుల మనోభావాలను దెబ్బతీసిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు అందించే బృహత్తర బాధ్యతను కలిగి ఉన్న అధికారిపై జేసీ ప్రభాకర్ రెడ్డి అనుచితంగా వ్యవహరించడం పట్ల వారు తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా తగు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ను కోరారు. అలాగే ప్రశాంత వాతావరణంలో ఉద్యోగులు తమ విధులు నిర్వర్తించేలా చూడాలని కలెక్టర్ ను కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎంపీడీవో సంఘం అధ్యక్షుడు నరేంద్ర మరియు ప్రధాన కార్యదర్శి నరేష్ కృష్ణ ఎంపీడీవోలు అయినా నసీమ, నటరాజు, రఘునాథ్ గుప్తా, పుట్టపర్తి ఎంపీడీవో నాగేశ్వర్ రెడ్డి, ఈవో ఆర్ డిలసంఘం తరపున అశోక్ రెడ్డి, ఇందిరా బాల, పంచాయతీ కార్యదర్శుల నుండి గోపాల్ రెడ్డి, ఈశ్వర్, శ్రావణ్, ఓం ప్రకాష్ , గోపీనాథ్, రమణప్ప, మహేంద్ర తదితరులు పాల్గొన్నారు

# హనుమాన్ దర్శన్‌ను భక్తాదులు సద్వినియోగం చేసుకోండి...!

**ధర్మవరం రూరల్ జూలై 21 ప్రభాతవార్త**



డిపో మేనేజర్ సత్యనారాయణ

శ్రావణమాసంలో హనుమాన్ దర్శనార్థం ధర్మవరం ఆర్టీసీ డిపో నుండి ప్రత్యేక బస్సును ఏర్పాటు చేయడం జరుగుతుందని డిపో మేనేజర్ సత్యనారాయణ ఓ ప్రకటన ద్వారా తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రావణమాసంలో ప్రతి మంగళ, శని, వారములలో మురడి, నేమకల్లు, కసాపురం, మూడు పుణ్యక్షేత్రాలు ఒకేరోజు దర్శనం చేసుకునే అవకాశాన్ని భక్తులకు ఆర్టీసీ అవకాశం కల్పిస్తుందని ఈనెల 26న, 29న, ఆగస్టు 2న, ఆగస్టు 5న, ఆగస్టు 9న, ఆగస్టు 12న, ఆగస్టు16న, ఆగస్ట్ 19న, ఆగస్టు 23వ తేదీలలో ఆర్టీసీ రవాణా సౌకర్యం అందుబాటులో ఉంటుందని ఈ పుణ్యక్షేత్రములు భక్తులు దర్శించుకునేందుకు రాను పోను టికెట్టు ధర పెద్దలకు 600 రూపాయలు పిల్లలకు 320 రూపాయలు ఉంటుందని తెలిపారు. ఆసక్తి గల భక్తాదులు ఆన్లైన్ ద్వారా గాని, లేదా ఆర్టీసీ బస్టాండ్ నందు రిజర్వేషన్ కౌంటర్ నందు గాని టికెట్లను ముందుగా రిజర్వ్ చేసుకునే అవకాశం కలదని డిపో మేనేజర్ తెలిపారు. భగవంతుని సేవలో భక్తాదులు ఉంటే భక్తుల సేవలో ఆర్టీసీ సంస్థ ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు. మరిన్ని వివరాలకు సెల్ నెంబర్ 9959225859, 73 82860418, కు గాని సంప్రదించాలని తెలిపారు.

# మద్యం కుంభకోణంలో జగన్ కు జైలుశిక్ష తప్పదు

## - ప్రభుత్వ విప్ కాలవ

**రాయదుర్గం జూలై 21 ప్రభాతవార్త**

దేశంలోనే అతిపెద్ద మద్యం కుంభకోణంలో వై ఎస్ జగన్మోహన్ రెడ్డి త్వరలో జైలుకువెళ్లకతప్పదని ప్రభుత్వవిప్ కాలవ శ్రీనివాసులు పేర్కొన్నారు. సిట్టింగ్ ఏంపి మిథున్ రెడ్డి కేంద్రంగా జరిగిన ఈ భారీ కుంభకోణంలో అసలు సూత్రధారులు, పాత్రధారులు, భాగస్వాములు ఎవ్వరూ చట్టం నుండి తప్పించుకోలేరని వెల్లడించారు. రాయదుర్గం 22వ వార్డులో సోమవారం జరిగిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వివిధ డిస్టిలరీల నుంచి అక్రమంగా వసూలు చేసిన రూ.వేలకోట్ల సొమ్ము అంతిమ లబ్ధిదారు తాడేపల్లి ప్యాలెస్ యజమానేనని ప్రత్యేక దర్యాప్తు బృందం ఆధారాలతో రుజువు చేయబోతోందన్నారు. ఎవరెవరి పాత్ర ఉందో సమగ్ర వివరాలతో త్వరలో ఛార్జీ షీట్ సమర్పించబోతోందన్నారు. జగన్మోహన్ రెడ్డితో పాటు ఎవరైతే ఉన్నారో వాళ్ళందరూ జైలు ఊచలు లెక్కించక తప్పదన్నారు.

**సంక్షేమానికి పెద్దపీట..** చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం తల్లికివందనంద్వారా పిల్లల చదువులకు ఆర్థిక ఇబ్బంది లేకుండా లబ్ధిదారుల కుటుంబాలకు సాయం అందిస్తోందన్నారు. ఏదో పథకం ద్వారా ప్రభుత్వసాయం అందుకుంటున్న ప్రతికుటుంబంలోనూ ఆనందం వెల్లివిరు స్తోందన్నారు. పేద కుటుంబాలు ఆర్థికంగా లబ్ది పొందుతున్నాయన్నారు. ఏడాదికి మూడువంట గ్యాస్‌సిలిండర్లు ఉచితంగాఅందించటం జరుగుతుంద న్నారు. ఈ నెలలోనే అన్నదాత సుఖీభవ కింద రైతుల ఖాతాల్లో డబ్బులు పడే అవకాశం ఉందన్నారు. తొలి ఏడాదిలోనే రాయదుర్గం అభివృద్ధి విషయంలో కూడా చాలా ప్రగతిని సాధించిందనీ తెలియచేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు పసుపులేటి నాగరాజు, వార్డు ఇంఛార్జీ ఆనంద్, టి.హనుమంతు, సిమెంట్ సీనా,సుమలత, కొండాపురం సీనా,మల్లి,తదితరులు పాల్గొన్నారు.

# ప్రారంభోత్సవానికి నోచుకోని సచివాలయ భవనాలు

**చిలమత్తూరు, జూలై 21 ప్రభాతవార్త**



ప్రారంభంకాని సచివాలయం భవనం



మండలంలోని దేమకేతేపల్లి గ్రామ సచివాలయ భవన నిర్మాణం పూర్తయి ఏడాదికి పైగా కావస్తువుపటికీ ప్రారంభోత్సవానికి నోచుకోకపోవడం పట్ల స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భవన నిర్మాణాన్ని పూర్తి చేసిన కాంట్రాక్టర్‌కు ఫైనల్ బిల్లు పెండింగ్‌లో వుండటమే ఇందుకు ప్రధాన కారణమని తెలిసింది. ఇంజనీరింగ్ అసిస్టెంట్ తరచూ సెలవుల్లో వుండటం, మండల పంచాయతీరాజ్ ఇంజనీర్ బెంగళూరులో నివాసం వుండి బాధ్యతలపై నిర్లక్ష్యం వహించడంతో సమస్య మరింత జఠిలమైందని తెలుస్తోంది. ఇదే పరిస్థితి పలగలపల్లి గ్రామంలోనూ వుంది. అక్కడ రైతు సేవా కేంద్రం, విలేజ్ క్లినిక్ భవనాలు కూడా ఫైనల్ బిల్లులు చెల్లించకపోవడంతో వినియోగంలోకి రాలేదు. ప్రజాధనంతో నిర్మించిన ఈ భవనాలు ఉపయోగం లేకుండా వుండటంపై ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే అధికారులు స్పందించి బిల్లులు చెల్లించి భవనాలను అందుబాటులోకి తేవాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయమై పంచాయతీరాజ్ ఇంజనీర్‌ను వివరణ కోరగా కాంట్రాక్టర్ ఫైనల్ బిల్లు పెండింగ్‌లో వుందని, బిల్లులను ఇప్పటికే సమర్పించామని, ప్రపోజల్ పంపామని, ప్రభుత్వం నుండి నిధులు రావాల్సి వుందని పంచాయతీ రాజ్ ఇంజనీర్ తెలిపారు.

# కుక్క అడ్డు రావడంతో బైక్ నుండి కిందపడి వ్యక్తి మృతి

**చిలమత్తూరు, జూలై 21 ప్రభాతవార్త**

కుక్క అడ్డు రావడంతో బైక్ నుండి ప్రమాదవశాత్తు కిందపడి వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని చెన్నంపల్లి గ్రామం ముత్రాయనస్వామి గుడి సమీపంలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు చెన్నంపల్లి గ్రామానికి చెందిన సతీష్ (33) బైక్‌పై చిలమత్తూరుకు వస్తుండగా మార్గమధ్యంలో కుక్క అకస్మాత్తుగా అడ్డం రావడంతో అదుపుతప్పి కింద పడిపోయాడు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అతన్ని స్థానికులు హుటాహుటిన హిందూపురం ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే మృతిచెందాడు. సతీష్‌కు భార్య, ఇద్దరు కుమారులు వున్నారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం హిందూపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు.

# అన్నదాత సుఖీభవ సాయం ఇంకెప్పుడు విడుదల చేస్తారు..!?

**-ఉపాధి హామీ కూలీలకు పెండింగ్ వేతనాలు విడుదల చేయాలి**

**-ప్రజా సమస్యల పరిష్కార వేదిక ముందు సీపీఎం పార్టీ ధర్నా**

**ఉరవకొండ, జూలై 21 ప్రభాతవార్త**



ప్రజా సమస్యల పరిష్కార వేదిక గది ముందు ధర్నా నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు



తహశీల్దార్ ఎస్.మహబూబ్‌బాషా, ఏవో బి.రామకృష్ణుడుకు వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం అన్నదాత సుఖీభవ సాయం విడుదల చేయకుండా రైతులను ఇంకెంత కాలం మభ్యపెడుతుం దని సీపీఎం పార్టీ ప్రశ్నించింది. సోమవారం ఆ పార్టీ నాయకులు పట్టణంలోని మండల తహశీల్దార్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక గది ముందు బైటాయించి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఎం.కృష్ణ మూర్తి, ప్రాంతీయ కార్యదర్శి ఎ.రంగారెడ్డి, మండల కార్యదర్శి ఎన్.మధుసూదన్ మాట్లాడుతూ ప్రభుత్వం ఖరీఫ్ పంట కాలం ప్రారంభానికి ముందే అన్నదాత సుఖీభవ కింద 20వేల రూపాయల వంతున రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తామని చెప్పి సీజన్ ప్రారంభమై రెండు నెలలు గడిచిపోతున్నా ఇప్పటివరకు జమ చేయలేదన్నారు. దీంతో రైతులు పంటల పెట్టుబడికి అష్టకష్టాలు పడాల్సి వస్తోందన్నారు. ఉపాధి హామీ కూలీలకు గత 4 నెలలుగా వేతనాలు అందకపోవడంతో కూలీలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు.ప్రభుత్వం ఆలస్యంచేయకుండా పెండింగ్‌లో ఉన్న బిల్లులను విడుదల చేయాలని కోరారు. అన్ని గ్రామాల్లో ఉపాధి పనులు కల్పించాలని, కూలీలకు రోజువారి వేతనం 600 రూపాయలు అందించాలని, పనిముట్లు, పనిప్రదేశంలో సౌకర్యాలు కల్పించాలని కోరారు. కౌలు రైతులందరికీ సీసీఆర్‌సీ కార్డులు మంజూరు చేయాలని, అన్నదాత సుఖీభవ సాయంతోపాటు విత్తనాలు, ఎరువులను రాయితీతో అందించాలని డిమాండ్‌చేశారు. ధర్నా అనంతరం తహశీల్దార్ ఎస్.మహబూబ్‌బాషా, ఏవో బి.రామకృష్ణుడుకు వినతిపత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు బి.జ్ఞానమూర్తి, సీపీఎం పార్టీ మండల కమిటీ సభ్యులు మురళి, రవి, సిద్దప్ప, కౌలు రైతు సంఘం నియోజకవర్గ అధ్యక్షులు సురేష్, ప్రధాన కార్యదర్శి వెంకటేష్, నాయకులు సుంకన్న, బ్రహ్మయ్య, నారాయణస్వామి, తిమ్మప్ప, వన్నూరుస్వామి తదితరులు పాల్గొన్నారు.

# డిజిటల్ అసిస్టెంట్ లేక ప్రజల ఇక్కట్లు పట్టించుకోని అధికారులు..!

**కొత్తచెరువు, జులై 21, ప్రభాతవార్త**





శ్రీ సత్య సాయి జిల్లా పుట్టపర్తి నియోజకవర్గం బుక్కపట్నం మండల పరిధిలోని సిద్దరాంపురం గ్రామ సచివాలయం నందు డిజిటల్ అసిస్టెంట్ లేకపోవడంతో ప్రజలు ఇక్కట్లకు గురవుతున్నారు. సిద్దరాంపురం గ్రామపంచాయతీ పరిధిలో సిద్దరాంపురం ధూపం పల్లి లింగప్ప గారి పల్లి చెండ్రాయిని పల్లి, తరుగొల్లపల్లి మొత్తం ఐదు గ్రామాలు 5000 జనాభా పైగా ఉన్నారు. గత ప్రభుత్వంలో సచివాలయ వ్యవస్థ ఏర్పడిన అనంతరం సిద్దరాంపురం గ్రామ సచివాలయంకు పూర్తిస్థాయి సిబ్బందిని ఏర్పాటు చేశారు. ఈ గ్రామం పరిధిలో ఏడు అంగన్వాడి సెంటర్లు, ఐదు ప్రాథమిక పాఠశాలలు, ఒక జడ్పీహెచ్ఎస్ పాఠశాల ఉంది. ప్రతినిత్యం ప్రభుత్వం యొక్క ధ్రువీకరణ పత్రాలు కొరకు ఇక్కడ డిజిటల్ అసిస్టెంట్ అవసరం ఏర్పడుతూనే ఉంటుంది. అయితే 2022 డిసెంబర్లో అక్కడ పనిచేసే డిజిటల్ అసిస్టెంట్ ఆర్.శివకుమార్ నాయక్ దీర్ఘకాలిక సెలవుపై వెళ్లడంతో వేరొకరిని ఆ పోస్టులో ఇప్పటివరకు భర్తీ చేయలేదు. దీంతో తాము ఆన్లైన్ సంబంధించిన ఏ పని చేయించుకోవాలన్నా మండల కేంద్రానికి వెళ్లాల్సి వస్తుందని, లేక ఇంటర్నెట్ సెంటర్ల పైనే ఆధార పడాల్సి వస్తుందని గ్రామస్తులు వాపోతున్నారు. ఈ విషయమై పలు మార్లు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ వారి నుండి ఎటువంటి స్పందన రావడంలేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా ఈ సర్వీసెస్ లు రైతులు సంబంధించిన 1 బీ లు, రేషన్ కార్డ్స్ విద్యార్థులకు సంబంధించి కుల ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, నివాస ధ్రువీకరణ పత్రాలు, సిఎస్సి సేవలు , ఆధార్ సేవలు , రీ సర్వేలు ఇలా మొత్తం 546 సేవలు డిజిటల్ అసిస్టెంట్ ద్వారా ప్రజలకు అందజే యబడును డిజిటల్ అసిస్టెంట్ లేకపోవడంతో గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు తమ సమస్యలను గుర్తించి వెంటనే డిజిటల్ అసిస్టెంట్ విధులకు హాజరయ్యేలా చూడాలని, లేక వేరొక ఉద్యోగినో ఆ స్థానంలో నియమించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# అక్రమాలకు పాల్పడిన యానిమేటర్ పై మంత్రులకు ఫిర్యాదు.



మంత్రులకు ఫిర్యాదు చేస్తున్న దృశ్యం

**గుడిబండ జూలై 21 ప్రభాతవార్త**

మండలంలోని పీసిగిరిగ్రామంలోని మహిళాసంఘాల్లో అవినీతి అక్రమాల కు పాల్పడిన యానిమేటర్ పై ఆ గ్రామ మహిళలు మంత్రులకు ఫిర్యాదు చేశారు. మండల పరిధిలోని పిసిగిరి గ్రామంలో గత కొన్ని సంవత్సరాలుగా దాదాపు 16 మహిళా సంఘాలు బ్యాంకుల నుండి రుణాలు తీసుకోవడం తీసుకున్న రుణాన్ని సక్రమంగా జమచేయడం జరుగుతుండేదని అయితే మా గ్రామంలో మహిళా సంఘం యానిమేటరుగా పనిచేస్తున్న సురేష్ అనే వ్యక్తి 16 సంఘాల్లోని దాదాపు 15 లక్షలు కాజేసి పరారైనట్లు ఈ సందర్భంగా వారు రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత, బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవితమ్మలకు ఫిర్యాదు చేశారు. గత కొన్నిసంవత్సరాలుగా బ్యాంకుల నుండి రుణాలు తీసుకొని వ్యవసాయం వ్యాపారాలు చేసుకుంటూ ఎంతో అభివృద్ధి చెందినామని సంఘాలు అన్ని సక్రమంగా జరిగి మా కుటుంబా లు పురోగతి చెందేసమయంలో సదరు యానిమేటర్ మేము బ్యాంకు కు జమ చేయడానికి కట్టిన నగదును తిరిగి బ్యాంకులకు చెల్లించకుండా సదరు యానిమేటర్ కాజేసిపరారైనట్లు వారు మంత్రులదృష్టికి తీసుకెళ్లారు.దీంతోపాటు ప్రభుత్వం నుండి వచ్చే వివిధ అభివృద్ధి పథకాలు మీకు అందుతాయని నమ్మించి పలువురు సంఘసభ్యుల చేత వేలిముద్రలు వేయించుకొని బ్యాంకుల్లో ఉన్న నగదును కూడా కాజేసినట్లు వారు తెలిపారు. దీంతో ఏళ్ల తరబడి సంఘాలు జరుపకపోవడంతో తమసంఘాల బ్యాంక్అకౌంట్‌లను బ్యాంకు అధికారులు బ్లాక్లిస్టు లో పెట్టడంతో మేము తీసుకున్న అప్పులు రెట్టింపు అయ్యాయని ప్రస్తుతం అప్పులు చెల్లించలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.సదరు యానిమేటర్ చేసిన అవినీతి అక్రమాల వల్ల తమకు ఈపరిస్థితిఏర్పడిందని ప్రస్తుతందిక్కుతోచని పరిస్థితుల్లో ఉన్నామని, ఇప్పటికైనా అవినీతి అక్రమాలకు పాల్పడి సంఘాల డబ్బులు దోచుకుని పరారీ అయిన సదరు సురేష్ ను అరెస్టు చేసి మా డబ్బులు మాకు రికవరీ చేసే విధంగా పోలీస్ అధికారులకు ఆదేశం ఇవ్వాలని మంత్రులను కోరారు.

# విద్యార్థుల రికార్డులను గాలికి వదిలేసిన అధికారులు

**- మందుబాబులకు అడ్డాగా మారిన తిమ్మాపురం బాలుర వసతిగృహం**

**- ఆ భవనం వైపు కన్నెత్తి చూడని సాంఘిక సంక్షేమ శాఖ అధికారులు**





చెల్లాచెదురుగా పడివున్న విద్యార్థి రికార్డులు , తిమ్మాపురం ప్రభుత్వ బాలుర వసతి గృహం

**కంబదూరు, జూలై 21, ప్రభాతవార్త**





భవనం తలుపులను పగలగొట్టిన దృశ్యం, (ఇన్ సెట్) లో అల్లరి మూకలు తాగి పడేసిన మద్యం బాటిల్లు

కంబదూరు మండలం తిమ్మాపురంలోని ఆనంద నిలయంగా పిలవబడే ప్రభుత్వ సాంఘిక సంక్షేమ శాఖ బాలురవసతి గృహభవనం అసాంఘిక కార్యక్రమాలకు అడ్డగా మారుతోంది. ఒకప్పుడు ఎంతోమంది విద్యార్థులకు ఆశ్రయాన్ని కల్పించి వారిని చైతన్యవంతులుగా తీర్చిదిద్దిన తిమ్మాపురం ఆనంద నిలయం ఇప్పుడు మందు బాబులకు నిలయంగా తయారైంది. గతకొద్ది సంవత్సరాలనుంచి ప్రభుత్వహాస్టలలో విద్యార్థులు చేరిక శాతం గణనీయంగా పడిపోవడంతో ఈహాస్టల్ మూతపడింది. అప్పటినుంచి సాంఘిక సంక్షేమ శాఖ అధికారులు పట్టించుకోకపోవడంతో ఆనంద నిలయం అధ్వానంగా తయారైందని స్థానిక ప్రజలు వాపోతున్నారు. ఈ హాస్టల్ వైపు సంబంధిత అధికారులు కన్నెత్తి చూడకపోగా పూర్వ విద్యార్థులకు సంబంధించిన రికార్డులు, వస్తు సామాగ్రిని సైతం గాలికి వదిలేయడంతో సాంఘిక సంక్షేమ శాఖ అధికారుల తీరుపై విమర్శలు వెలివెత్తుతున్నాయి. ఇదిలా ఉంటే కొంతమంది అల్లరి మూకలు ఆ వసతి గృహంలో మద్యాన్ని సేవిస్తూ, భవనం తలుపులు పగలగొట్టి విలువైన వస్తువులను ఎత్తుకెళ్తున్నట్లు గ్రామ ప్రజలు ఆరోపిస్తున్నారు. ఒకప్పుడు ప్రభుత్వ నిధులను వెచ్చించి కొనుగోలు చేసిన వస్తువులను ఇలా గాలికి వదిలేయడం పట్ల పూర్వ విద్యార్థులు, ప్రజలు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సాంఘిక సంక్షేమ శాఖ అధికారులు , ప్రభుత్వ పాలకులు స్పందించి ఈ భవనాన్ని ప్రత్యామ్నాయంగా ప్రజలకు ఉపయోగపడేలా వినియోగించుకోవాలని తిమ్మాపురం గ్రామస్తులు కోరుతున్నారు.

# ఎస్ఎఫ్ఐ జిల్లా ప్లీనరీ సమావేశాలను జయప్రదం చేయండి
## ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఓతురు పరమేష్

అనంతపురం న్యూటౌన్, జులై 21 ప్రభాతవార్త

శింగనమల నియోజకవర్గం కేంద్రంలో జిల్లా ప్లీనరీ సమావేశాలు ఆగస్టు 04, 05 నిర్వహించనున్నట్లు ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఓతూరు పరమేష్ తెలిపారు. ఇందుకు సంబంధించి ఎస్ఎఫ్ఐ ప్లీనరీ సమావేశాల పోస్టర్లను కామ్రేడ్ గణే నాయక్ భవనంలో ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకత్వం ఆధ్వర్యంలో సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్రం లోని విద్యా రంగంలో ఉన్నవంటి సమస్యలు పరిష్కారం కోసం భవిష్యత్తు పోరాటానికి శ్రీకారం చుట్టడం ప్రణాళిక సిద్ధం చేసి పోరాటం నిర్వహించాలని ఈ జిల్లా ప్లీనరీ సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. బిజెపి ప్రభుత్వం విద్య వ్యవస్థ పూర్తిగా నాశనం చేయడం కోసం నూతన జాతీయ విద్యా విధానం పేరుతో దేశవ్యాప్తంగా విద్యను కాషాయకరణ ప్రైవేటీకరణ చేయడంలో ప్రయత్నం భాగంగా ఇప్పటికై దేశం ఉన్నటువంటి అన్ని సెంట్రల్ యూనివర్సిటీ ఆర్ఎస్ఎస్ వాదనలను ప్రొఫెసర్స్‌గా నియమ కాలు చేస్తున్నారు. ఇది సరైన విధానం కాదు అదే విధంగా ప్రైవేటీకరణ చేయడంలో బిజెపి ముందు భాగంలో ఉంటుంది. రాష్ట్రప్రభుత్వం అధికారం లో వచ్చి దాదాపు సంవత్సరం పూర్తి అయినప్పటికీ ఉన్న విద్యకు సంబంధించి ఫీజు రియం బర్స్మెంట్ స్కాలర్షిప్ 6400 కోట్లు రూపాయలు పెం డింగ్ ఉన్నా వాటి గురించి రాష్ట్ర ప్రభుత్వం తమకు ఏమాత్రం పట్టనట్టుగా వ్యవహరి స్తున్నా రు. పేద మధ్య తరగతి విద్యా ర్థులు విద్య అభ్యసి స్తున్న సంక్షే మ హాస్టల్లో దాదాపు మెస్ కాస్మోటిక్ ఛార్జీలు విడుదల చేయలేదు ప్రస్తుతం పెరిగిన ధరలకు అనుకూలంగా మెస్ చార్జీలు నెలకు 3000 రూపాయలు పెంచాలి. ఈ ప్లీనరీ సమావేశాలులో విద్యార్థులు మేధావులు పాల్గొని విజయవంతం చేయా లని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఓతూర్ పరమే ష్, ఎస్ఎఫ్ఐ జిల్లా గర్ల్స్ కన్వీనర్ రజిత,జిల్లా ఉపాధ్యక్షుడు వైటిసి రమే ష్, తరిమెల గిరి, జిల్లా సహాయ కార్యదర్శి సూర్య ప్రకాష్, భీమేష్, వెంక టేష్, శివ, వంశి, మెడికల్ కళాశాల గర్ల్స్ కన్వీనర్ పవిత్ర తదితరులు పాల్గొన్నారు.



ఎస్ఎఫ్ఐ జిల్లా ప్లీనరీ సమావేశాలు నిర్వహిస్తున్న దృశ్యం

# సబ్ జూనియర్, జూనియర్ ఆక్వాటిక్ ఛాంపియన్షిప్ పోటీలలో అనంతపురం జిల్లా క్రీడాకారుల ప్రతిభ

అనంతపురం, జులై 21 ప్రభాతవార్త బ్యూరో

రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన జూనియర్ సబ్ జూనియర్, జూనియర్ ఆక్వాటిక్ ఛాంపియన్‌షిప్ పోటీలలో అనంతపురంకు చెందిన ఈత క్రీడాకారులు వారి ప్రతిభ చాటి అందరి మన్ననలను పొందారు. వివరాల మేరకు.. ఈ నెల 19, 20వ తేదీలలో విశాఖపట్నంలో జరిగిన సబ్ జూనియర్, జూనియర్ ఆక్వాటిక్ ఛాంపియన్షిప్ పోటీలలో అనంతపురం జిల్లాకు చెందిన ఈత క్రీడాకారులు 5 స్వర్ణం, 2 రజతం, 3 కాంస్య పతకాలను గెలుచుకొని రాష్ట్రంలో 7వ స్థానంలో నిలిచారు. ఈ పోటీలలో గ్రూప్-1 క్రీడాకారుడు ఎస్. కార్తికేయ 5 స్వర్ణ పతకాలను గెలుచుకోవడమే కాకుండా వ్యక్తిగత ఛాంపియన్షిప్ కైవసం చేసుకొని తన సత్తాను చాటుకున్నాడు. గ్రూప్-1 యస్.కార్తికేయ 50 మీటర్లు బ్యాక్ స్ట్రోక్ స్వర్ణం 00:29:85 సెకండ్స్, 100 మీటర్లు బ్యాక్ స్ట్రోక్ స్వర్ణం 01:06:10, 200 మీటర్లు బ్యాక్ స్ట్రోక్ స్వర్ణం 02:26:52, 100మీటర్లు ఫ్రీస్టయిల్ స్వర్ణం 00:58:30 సెకండ్స్, 200 మీటర్లు ఫ్రీస్టయిల్ స్వర్ణం 02:07:67, పి.అకుల్‌సాయి, 100మీటర్లు బ్యాక్ స్ట్రోక్ కాంస్యం 01:21:57, 200మీటర్లు బ్యాక్ స్ట్రోక్ కాంస్యం 03:00:29, గ్రూప్-2 ఎమ్.ఎస్.ఎస్.జస్విన్ నాయుడు 100మీ టర్లు బ్యాక్ స్ట్రోక్ రజతం 01:16:05, 200మీటర్లు బ్యాక్ స్ట్రోక్ రజతం 02:54:01, 50మీటర్లు బ్యాక్ స్ట్రోక్ కాంస్యం 00:34:84, పతకాలను గెలుచుకున్న ఈత క్రీడాకా రులను జిల్లా ఈత సంఘం అధ్యక్షులు కామని రవిశేఖర్ రెడ్డి, కార్యదర్శి రాజశేఖర్, ఉపా ధ్యక్షులు వెంకట రెడ్డిలు అభినం దించారు.


ఆక్వాటిక్ ఛాంపియన్ షిప్ పోటీలలో పతకాలు సాధించిన క్రీడాకారులు

# శ్రీకృష్ణదేవరాయ యూనివర్సిటీలో టీచింగ్ నాన్ టీచింగ్ పోస్టులను భర్తీ చేయాలి
## - ఏఐఎస్ఎఫ్ ఎస్కెయు కార్యదర్శి రమణయ్య

అనంతపురం న్యూటౌన్, జులై 21 ప్రభాతవార్త

శ్రీకృష్ణదేవరాయ యూనివర్సిటీలో టీచింగ్ నాన్ టీచింగ్ పోస్టులను భర్తీ చేయాలని ఏఐఎస్ఎఫ్ శ్రీకృష్ణదేవరాల యూనివర్సిటీ కార్యదర్శి రమణయ్య పేర్కొన్నారు. ఇందుకు సంబంధించి ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా జులై 30, 31, ఆగస్టు 1,2 తేదీలలో జిల్లా వ్యాప్తంగా బైకు జాతను చేపట్టనున్నట్లు వారు తెలిపారు. సోమవారం మహానంది హాస్టల్ దగ్గర ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా విద్యారంగ సమస్యల పరిష్కారానికి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ హాస్టల్ గురుకుల పాఠశాల కేజీబీవీ పాఠశాల, హాస్టల్లో సమస్యల పరిష్కారానికై, అదేవిధంగా పెండింగ్‌లో ఉన్నటువంటి రూ.6400 కోట్ల ఫీజు రియంబర్స్మెంట్ స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలని కోరారు. జీవో నెంబర్ 77ను రద్దు చేయాలని, అదేవిధంగా యువ గలం పాదయాత్రలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. అనంతపురం జిల్లా వ్యాప్తంగా బైకు జాతాను జయప్రదం చేయాలని ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ నాయకులు సాయి మహేష్, శ్రీను నాయక్, రాజు, అంబి, సూర్య తదితరులు కోరారు.


మాట్లాడుతున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

# పోలీసుల విధులకు ఆటంకం
## - ఇద్దరిపై కేసు నమోదు.. అరెస్టు..14 రోజుల రిమాండ్ - త్రీటౌన్ సి.ఐ శాంతిలాల్

అనంతపురం, జులై 21 ప్రభాతవార్త బ్యూరో

అనంతపురంలో బ్లూకోల్ట్స్ సిబ్బంది విధులకు ఆటంకం కల్గించిన ఇద్దరిపై కేసు నమోదు చేసి అరెస్టు చేయడంతో పాటు 14 రోజుల రిమాండ్‌కు పంపడం జరిగిందని త్రీటౌన్ సి.ఐ శాంతిలాల్ తెలిపారు. ఆదివారం మధ్యహ్నం 3 గంటల సమయంలో స్థానిక గుత్తి రోడ్డు సమీపంలో ఓపెన్ డ్రింకింగ్ చేస్తున్నట్లు సమాచారం అందిందన్నారు. వెంటనే... బ్లూకోల్ట్స్ విధులలో వున్న కానిస్టేబుల్ గంగరాజు, హోంగార్డ్ రామాంజినేయులు ఆ ప్రదేశానికి వెళ్లారు. బుక్కరాయ సముద్రం మండలం ఎల్‌బినగర్‌కు చెందిన షేక్ షఫీ, షేక్ టిప్పు సుల్తాన్‌లు బహిరంగంగా మద్యం సేవిస్తుండటాన్ని పోలీసులు గమనించారన్నారు. చట్ట వ్యతిరేకమని ఓపెన్ డ్రింకింగ్ చేయరాదని పోలీసులు సూచించారు. పెడచె విన పెట్టడమే కాకుండా బ్లూకో ల్ట్స్ సిబ్బంది విధులకు ఆ ఇద్దరు ఆటంకం కల్గించారన్నారు. ఈ క్రమంలో షేక్ షఫీ, షేక్ టిప్పు సుల్తాన్‌లపై కేసు నమోదు చేయ డంతో పాటు అరెస్టు చేశామన్నారు. వీరిని మొబైల్ కోర్టు ముందు హాజరు పరచడంతో 14 రోజుల రిమాండ్‌కు ఆదేశిం చడంతో జిల్లా జైలుకు తరలించామన్నారు.


రిమాండ్‌కు తరలించిన షేక్ షఫీ, షేక్ టిప్పు సుల్తాన్‌లు

## విభిన్న ప్రతిభావంతుల వసతి గృహాల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానం

అనంతపురం న్యూటౌన్, జులై 21 ప్రభాతవార్త

అనంతపురం జిల్లాలోని విభిన్న ప్రతిభావంతుల, హిజ్రా, వయోవృద్ధుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో 3వ నుంచి డిగ్రీ వరకు చదువుతున్న విభిన్న ప్రతిభావంతులైన (శారీరక, బధిరులు, అంధులు) బాలురకు హెచ్ఎల్‌సి కాల నీ, అనంతపురంలో, విభిన్న ప్రతిభావంతులైన (శారీరక, బధిరులు, అంధులు) బాలికలకు అరవిందనగర్, అనంతపురంలో వసతి గృహాలలో బాలురు-100, బాలికలు 50 మందికి అవకాశం కలదని సహాయ సంచాల కులు జి.అర్చన ఒక ప్రకటనలో తెలిపారు. ఇతర వివరాల మేరకు 7893577797 లేదా కార్యాలయపు పనివేళల్లో 08554-232380లో సంప్రదించాలని కోరారు.

# ద్విచక్రవాహనాలు ఢీ ఒకరు మృతి ఒకరికి తీవ్రగాయాలు

బుక్కరాయసముద్రం, జులై 21 ప్రభాతవార్త

బుక్కరాయసముద్రం మండల కేంద్రంలోని గాంధీనగర్ సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కుళ్ళాయప్ప(20) ఒకరు మృతిచెందగా మరొకరు తీవ్రంగా గాయపడ్డారు.స్థానికులు పోలీసులు అందిం చిన వివరాలు ఇలా ఉన్నాయి.మృతుడు రేకులకుంట గ్రామానికి చెందిన బండారు నల్లప్ప తల్లి నాగవేణి దంపతులకు ముగ్గురు సంతానంల అందులో రెండవ కుమారుడు కుళ్ళాయప్ప బేల్దారిపనిచేసు కుంటూ జీవనం చేసుకొనేవాడు, రోజుమా దిరిగానే బేల్దారి పనికి రేకులకుంట నుండి అనంత పురం కు ద్విచక్రవాహనం మీద వస్తుండగా గాంధీనగర్ సమీపంలోకి రాగానే,అక్కడే వెల్డింగ్ షాఫ్ నిర్వహిస్తున్న బుల్లే పవన్‌కుమార్ బుక్కరా యసముద్రం నుండి వాటర్ క్యాన్ తీసుకొని స్కూటీ వాహనం మీద వెల్లుతున్న పవన్‌కుమార్‌ను, కుళ్ళాయప్ప బలంగా ఢీకొనడంతో కుళ్ళాయప్పకు తలకు బలమైయిన గాయాలు తగిలి అక్కడికి అక్కడే మృతిచెందాడు, పవన్‌కుమార్‌కు కూడ తలకు గాయాలతో పాటు కాలు,చెయ్యి విరిగినది,108 వాహనంద్వారా పవన్‌కుమా ర్‌ను ఆసుపత్రికి తరలించారు.మృతదేహాన్ని పోస్టుమార్డర్ నిమిత్తం అనంతపురం జనరల్ ఆసుపత్రికి తరలించారు.సిఐ పుల్లయ్య కేసునమోదు చేసుకొని దర్యాప్తుచేస్తున్నారు.


మృతిచెందిన కుళ్ళాయప్ప


కాలు చెయ్యి విరిగిన పవన్‌కుమార్

# సోషల్ వెల్ఫేర్ ఇన్‌ఛార్జ్ డీడీగా ఖుష్బూకొఠారి

అనంతపురం న్యూటౌన్, జులై 21 ప్రభాతవార్త

సోషల్ వెల్ఫేర్ ఇన్‌ఛార్జ్ డీడీగా ఖుష్బూ కొఠారి నియామకం అయ్యారు. గతంలో ఇక్కడ పనిచేస్తున్న డీడీ (ఎఫ్ఏసీ) రామాంజినేయులు రెగ్యులర్ డీటీడబ్ల్యూవోగా పనిచేస్తుండటంతో ఆయన్ను తన మాతృశాఖకు సరెండర్ చేస్తూ ఆ శాఖ డైరెక్టర్ గత నెల 16న ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన స్థానంలో డీటీడబ్ల్యూవోగా శ్రీనివాసరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు ఈ నేపథ్యంలో ఆయన డీటీడబ్ల్యూవోగా, డీడీగా రిలీవ్ అయ్యారు. ఇన్‌ఛార్జ్ డీడీగా బీసీ వెల్ఫేర్ డీడీ ఖుష్బూ కొఠారికి అప్పగిస్తూ ఇన్‌చార్జ్ కలెక్ట ర్ శివ్ నారాయణ్ శర్మ ఉత్తర్వులు జారీ చేశారు. రెగ్యులర్ డీడీ కోసం డైరెక్టర్‌కు ఫైల్ పంపించారు. ఒకటి, రెండు రోజుల్లో ఇన్‌ఛార్జ్ డీడీ బాధ్యతలు స్వీకరించ నున్నారు. గతంలో కూడా ఈ డీడీ సోషల్ వెల్ఫేర్ డీడీగా కొంత కాలం పనిచేశారు. మంచి అడి మ్నిస్ట్రేషన్ నిర్వర్తిస్తారని గుర్తింపు తెచు చ్చుకున్నారు.


ఖుష్బూకొఠారి

# డీసీఈబీ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు

అనంతపురం న్యూటౌన్, జులై 21 ప్రభాతవార్త

నగరంలోని ఉపాధ్యాయ భవనంలో సోమవారం సాయంత్రం ప్రైవేటు యాజమాన్యంకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.ప్రసాద్ బాబు ముఖ్య అతిథిగా హాజరై మన రాష్ట్రంలో మారిన పరీక్షా విధానం, ప్రశ్నాపత్రం ఎంపిక, నూతన సిలబస్, నూతన విద్యా విధానంపై అవగాహన కల్పించారు. ప్రస్తుత పరీక్ష విధానం, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు ఏకరీతి పాఠ్యాంశాలు ఉన్నాయన్నారు. కనుక ఏకరీతి పరీక్ష విధానాన్ని అనుసరించాలని, అలాగే ఏకరీతి ప్రశ్నపత్రాల, అనుసరించి ప్రైవేటు పాఠశాలలు కూడా ప్రభుత్వ ప్రశ్న పత్రాలను ఉపయోగించి తమ పాఠశాలలో పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏసి గోవింద నాయక్, ఏడి మునీర్ ఖాన్, ఉప విద్యాశాఖ అధికారులు శ్రీనివాస రావు, మల్లారెడ్డి, డీసీఈబీ సెక్రెటరీ గంధమనేని శ్రీనివాసులు, ప్రైవేట్ స్కూల్స్ కరస్పాండెంట్లు పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న దృశ్యం

# పేదరిక నిర్మూలన ద్వారానే వికసిత్ భారత్
## పీ-4 గ్రామ సభలు పకడ్బందిగా నిర్వహించండి
## - ఎంపిడిఓ భాస్కర్

శింగనమల, జులై 21 ప్రభాతవార్త

పేదరిక నిర్మూలన ద్వారానే వికసిత్ భారత్ స్వర్ణాంధ్ర 2029 సహకారం అవుతాయని ఎంపిడిఓ భాస్కర్ తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని ఎంపిడిఓ కార్యాలయంలో మండల వ్యాప్తంగా ఉన్న పంచాయితీ కార్యదర్శిల తో సమావేశం నిర్వహించారు. నేడు బండమీద పల్లి, కొరివిపల్లి, సలకం చెరువు పంచాయితీలలో పి-4 గ్రామ సభలుని ర్వహి స్తున్నట్లు, 23వ తేది కల్లుమడి, పెరవలి, తరిమెల, ఉల్లికల్లు పంచాయి తీల్లో, 24వ తేది నిదన వాడ, శింగనమల పంచాయితీల్లో గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు ఈ గ్రామ సభల ద్వారా అనర్హులను తొలగించి అర్హులకు అవకాశం కల్పిస్తున్నట్లు పార్టీలకు అతీతంగా బంగారు కుటుంబాలను గుర్తిస్తున్నట్లు ఆయన తెలిపారు. సాధారణ బదిలీలలో భాగంగా మండల పరిధిలో దాదాపు 54 మంది బదిలీపై వెళ్లగా, ఇప్పటి వరకు 53 మంది తిరిగి జాయిన్ అయినట్లు ఆయన తెలిపారు. చక్రాయపేట పంచాయితీ స్నేహ, జులా కాలువకు రఘు, మట్లగొందికి రవీంద్రరెడ్డి, నాయినవారిపల్లికి సాయిచరణ్, లోలూరు రాజశేఖర్, గుమ్మేపల్లికి శ్రీనివాసులు, నాగలగుడ్డం తాండా గ్రామానికి సత్యసింహా, పంచాయితీ కార్యదర్శిలుగా బాధ్యతలు స్వీకరించినట్లు ఆయన తెలిపారు.


పంచాయితీ కార్యదర్శిలతో మాట్లాడుతున్న ఎంపిడిఓ భాస్కర్

# తప్పిపోయిన బాలున్ని తల్లిదండ్రులకు అప్పగించిన 4వ పట్టణ పోలీసులు

అనంతపురం కలెక్టరేట్, జులై 21 ప్రభాతవార్త

స్థానిక ఆలుమూరు రోడ్డు సమీపంలో నివాసముంటున్న కమలమ్మ, బొజ్జన్నల నాలుగేళ్ల కుమారుడు సోమవారం ఉదయం ఆడుకుంటూ ఇంటి నుండి బయటికొచ్చాడు. తిరిగి ఇంటికి ఎలా వెళ్లాలో తెలియక రుద్రంపేట బైపాస్ వద్ద ఏడుస్తూ తిరుగుతున్న చిన్నారిని చూసి డయల్ 100కు సమాచారం ఇచ్చారు. అనంతపురం 4వ పట్టణ సిఐ జగదీష్ వెంటనే స్పందించి బ్లూకోల్ట్స్ సిబ్బందిని చిన్నారి వున్న ప్రదేశానికి పంపారు. చేతన్‌ను చేరదీసి పోలీసుస్టేషన్‌కు తీసికెళ్లి సురక్షితంగా వుంచారు. మరోవైపు ఆ చిన్నారి తల్లిదండ్రుల ఆచూకీ కోసం ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపి ఆరా తీయించారు.ఆలుమూరు రోడ్డు సమీపంలో వుంటున్న కమలమ్మ, బొజ్జన్నల అడ్రస్ తెలుసుకుని పోలీసుస్టేషన్‌లో ఆ చిన్నారిని తల్లిదండ్రులకు అప్పగించారు. కేవలం గంట లోపు తమ చిన్నారిని తమ వద్దకు చేర్చడం పట్ల సంతోషం వ్యక్తం చేస్తూ 4వ పట్టణ పోలీసులకు ఆ తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలియచేశారు.

# దళిత బిడ్డకు న్యాయం చేయమంటే అక్రమ నిర్బంధాలా
## రెడ్ బుక్ పేజీల పేర్లకు బయపడం..అక్రమాలను ప్రశ్నిస్తూనే ఉంటాం - కూటమి నేతలకు దళితులంటే ఎందుకు అంత వివక్ష - వైసీపీ నేతల విమర్శలు

అనంతపురం సిటీ జులై 21 ప్రభాతవార్త

కామాంధుల చేతిలో అన్యాయానికి గురైన దళిత బిడ్డకు న్యాయం చేయమంటే వైసీపీ ఎస్సి నేతలను అర్ధరాత్రి గృహ నిర్బంధాలు చేస్తారా అని వైసీపీ నేతలు ప్రశ్నించారు. జిల్లా వైసీపీ కార్యాలయంలో మేయర్ మహమ్మద్ వసీం వైసీపీ నగర అధ్యక్షులు చింతా సోమశేఖర్ రెడ్డి,ఎస్సి సెల్ జిల్లా అధ్యక్షులు మల్లెమీద నరసింహులు విలేకరుల సమావేశంలో మాట్లా డారు. ఈ సందర్భంగా మేయర్ మహమ్మద్ వసీం మాట్లాడుతూ రాష్ట్ర హోం మంత్రి అనిత మడకశిర పర్యటనలో రామగిరి మండలంలో కామాంధుల చేతిలో అత్యాచారానికి గురై బిడ్డకు జన్మనిచ్చిన మైనర్ దళిత బాలికకు న్యాయం చేయాలని కోరేందుకు అనంతపురం వైసీపీ ఎస్సి సెల్ నేతలు ప్రయత్నిస్తే పోలీసులు రాత్రికి రాత్రి వైసీపీ నేతలను గృహ నిర్బంధం చేయడం సరికాదన్నారు.రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దాడులు, దౌర్జన్యాలు,అక్రమ అరెస్టులు నిత్యకృత్యం అయ్యాయని విమర్శించారు. రెడ్ బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తూ వైసీపీలో ముఖ్య నేతల ను టార్గెట్ చేస్తూ అక్రమ అరెస్టులు చేస్తూ ప్రజాస్వామ్యాన్నీ ఖునీ చేస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో మహిళలకు రక్షణ కరువైం దని ,మైనర్ బాలిక అత్యాచారానికి గురై ప్రసవిస్తే బాలికను పరామర్శించే ందుకు వైసీపీ నేతలు వెళ్తే పోలీసుల ద్వారా అడ్డుకోవడం సిగ్గుచేట న్నారు.బాధిత బాలికకు న్యాయం చేయాలని హోంమంత్రి అనితను ప్రశ్నిస్తా రన్న భయంతో వైసీపీ ఎస్సి సెల్ నేతలను అర్ధరాత్రి అక్రమంగా గృహ నిర్బంధం చేయడం అప్రజాస్వామికమన్నారు.ప్రజాస్వామ్యబద్ధంగా నిలదీసే ప్రయత్నం చేస్తే అక్రమ అరెస్ట్ చేస్తారా అని,ప్రజాస్వామ్యబద్ధంగా పోరాటం చేసే హక్కు కూడా రాష్ట్రంలో లేదా అని ఆయన ప్రశ్నించారు.పార్టీ కార్యక్ర మం కోసం మడకశిరకు వచ్చిన హోంమంత్రి అనిత మైనర్ దళిత బాలికను పరామర్శించేందుకు అనంతపురం రాలేరా అని ప్రశ్నించారు.అదే విధంగా ఎలాంటి ఆధారాలు లేకున్నా ఎంపీ మిథున్ రెడ్డిని అక్రమంగా అరెస్ట్ చేయడం కూటమి నేతల కక్షసాధింపులో భాగంగానే అని ఆరోపించారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి సన్నిహితంగా ఉన్నవారిని అక్రమంగా అరెస్ట్ చేస్తూ మానసికంగా దెబ్బతీసే ప్రయత్నం చేస్తున్నారని, ఇలాంటి ఎన్ని కేసులు పెట్టినా వైసీపీ శ్రేణులు భయపడే ప్రసక్తేలేదని స్పష్టం చేశారు. వైసీపీ నగర అధ్యక్షులు చింతా సోమశేఖర్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో నడుస్తున్నది నారా పాలన కాదని నరకాసుని పాలన అని విమర్శించారు. కూటమి ప్రభుత్వం ప్రజల బాగోగులు పట్టించుకోకుండా నిత్యం నిర్బంధాలు, అరాచకాలతో కాలం గడుపుతున్నారన్నారు.దళిత మైనర్ బాలికకు న్యాయం చేయమనడం తప్పు అన్నట్లు అర్ధరాత్రి వైసీపీ నేతలను గృహ నిర్బంధం చేయడం ఏమిటని ప్రశ్నించారు. పోలీసులు ఇండియన్ ఫిడల్ కోడ్ కాపాడాలని సూచించారు.రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కాదు విష కూటమి ప్రభుత్వ పాలన నడుస్తోందని విమర్శించారు. టీడీపీ ప్రభుత్వం నిర్వహి స్తున్న తొలి అడుగు కార్యక్రమం అపార్టీకి చివరి అడుగుగా నిలుస్తోందని హెచ్చరించారు.మీరు ఎన్ని అక్రమ కేసులు పెట్టినా రెడ్ బుక్కులో పేజీలు మీ పెన్నులు ఇంకు అయిపోవాల్సిందే మేము ఎప్పుడూ ప్రజల పక్షమే అని,కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తునే ఉంటామని ఆయన స్పష్టం చేశారు.ఎస్సి సెల్ జిల్లా అధ్యక్షులు నరసింహులుల మాట్లాడుతూ దళితులు అంటే కూటమి నేతలకు ఎందుకు అంత చిన్నచూపు అని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వంలో దళితులకు రక్షణ కరువైందని ,ప్రశ్నిస్తున్న ఎస్సి సెల్ నేతలపై అక్రమ కేసులు పెట్టడమే కాకుండా గృహ నిర్బంధం చేస్తున్నారని విమర్శించారు.నగరంలో 36 మద్యం షాప్‌లు కలిగిన ఎమ్మెల్యే కూడా అక్రమ మద్యం, నకిలీ మద్యం అని మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందని ఎద్దేవా చేశారు.నిత్యం వారి మద్యం షాప్ లలో నకిలీ మద్యం అమ్మకాలతో అనారోగ్యంకు గురి అవుతున్న పేదలను ఆదుకోవాలని సూచించారు. సమావేశ ంలో బూత్ కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాధాకృష్ణ, జిల్లా అధ్యక్షులు ఎద్దుల ఆమర్నాథ్ రెడ్డి,ఎస్సి సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎగ్గుల శ్రీనివాసులు, కార్పొరేటర్లు శ్రీనివాసులు, ఇషాక్,కమల్ భూషణ్,రహంతుల్లా,వైసీపీ నాయకులు కాకర్ల శీనా,అసిఫ్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ మహమ్మద్ వసీం

## ఇంజనీరింగ్ వర్కర్లకు వేతనాల పెంపుపై యూనియన్ హర్షం
### - కూటమి ప్రభుత్వానికి, మున్సిపల్ శాఖకు ధన్యవాదాలు

అనంతపురం, జులై 21 ప్రభాతవార్త

మున్సిపల్ ఇంజనీరింగ్ వర్కర్లకు కూటమి ప్రభుత్వం వేతనాలు పెంచుతూ జి.ఓ. జారీ చేయడం పట్ల ఏ.పి.ఎం.ఈ.డబ్ల్యూ.యు. జిల్లా కమిటి సోమవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేసింది. స్వచ్ఛందంగా గతంలో 15 రోజుల పాటు ప్రధాన యూనియన్లకు అతీతంగా శాంతియుతంగా సమ్మె చేసి కూటమి ప్రభుత్వ ప్రజా ప్రతినిధులకు, మున్సిపల్ శాఖ క్రిందిస్థాయి నుండి ఉన్నతాధికారులకు వివిధ రూపాలలో న్యాయమైన సమస్యలు పరిష్కారం కోసం అందోళన నిర్వహించిన విషయం పాఠకులకు విదితమే. కూటమి ప్రభుత్వం స్పందించి ఇచ్చిన హామీ మేరకు త్రిసభ్య కమిటి వేసి వేతనాలు పెంచడమైనది. ఇందుకు సహకరించిన ఎమ్మెల్యేకు, ఎంపికి, జిల్లా కలెక్టర్, నగరపాలక సంస్థ కమిషనర్, ఇతర శాఖల అధికారులు నివేదిక మేరకు పంపిన వేతనాలు పెంచినందుకు జిల్లా కమిటి వారు ధన్యవాదాలు వ్యక్తం చేశారు. అలాగే సహకరించిన ప్రింట్ మరియు ఎలక్ట్రానిక్ మీడియాకు ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ వర్కింగ్ యూనియన్ (ఏ.పి.ఎం.ఈ.డబ్ల్యూ.యు.) తం పున జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం.భాస్కర్‌రెడ్డి, లోకేష్ నాయుడు, నాయకులు పుల్లయ్య, రామాంజులరెడ్డి,జగదీష్, రవిశంకర్‌రెడ్డి, నారాయణ స్వామి, సురేష్‌బాబు, నూర్ బాషా తదితరులు అభినందనలు తెలియజేశారు.

## రమేష్ నాయక్ కుటుంబానికి అండగా నిలుస్తాంఏడిసిసి బ్యాంకు చైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి

అనంతపురం వైద్యం జులై 21 ప్రభాతవార్త

విద్యుత్ ఘాతంతో శనివారం రోజున మరణించిన పామిడి ఎడిసిసి బ్యాంక్ స్టాఫ్ అసిస్టెంట్ రమేష్ నాయక్ కుటుంబానికి అండగా నిలుస్తామని ఎడిసిసి బ్యాంక్ చైర్మన్ నుంటి మడుగు కేశవరెడ్డి అన్నారు. సోమవారం బ్యాంకు ప్రధాన కార్యాలయంలో బ్యాంకు సిబ్బందితో కలిసి రమేష్ నాయక్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం ఆయన మాట్లాడుతూ రమేష్ నాయక్ మృతి ఆ కుటుంబానికి తీరని లోటని వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కుటుంబ సభ్యుల్లో ఒకరికి బ్యాంకులో కారుణ్య నియామకం కింద ఉద్యోగాన్ని కల్పిస్తామని ఆయన పేర్కొన్నారు. చైర్మన్గా తనకు వచ్చే ఒక నెల గౌరవ వేతనం రూ.80 వేలు రమేష్ నాయక్ కుటుం బానికి ఇస్తున్నట్లు ప్రకటించారు. అనంతరం బ్యాంకు సీఈఓ సురేఖ రాణి మాట్లాడుతూ రమేష్ నాయక్ మృతదేహానికి చైర్మన్ దగ్గర ఉండి పోస్టుమార్టం ఏర్పాట్లు చేశారని అన్నారు. మృతుడి అంత్యక్రియలు కోసం బ్యాంకు అందించే రూ.15వేలు చైర్మన్ చేతుల మీదుగా ఇవ్వాలని కోరగా ఆయన ఆ మొత్తానికి తన వంతు తక్షణ సహాయం కింద రూ 50 వేల ఆర్థిక సహాయం అందించి తన దాతృత్వాన్ని చాటుకున్నారని పేర్కొన్నారు . చైర్మన్ స్పూర్తితో బ్యాంకు ఉద్యోగుల తమ ఒకరోజు వేతనం 4 లక్షల 36 వేల రూపాయలు రమేష్ నాయక్ కుటుంబానికి ఆర్థిక సహాయంగా అందజేస్తామని సీఈవో తెలిపారు. అలాగే తన వంతు సహాయంగా రూ 5000 రూపాయలు అందిస్తానని ఆమె తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.


రమేష్ నాయక్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఏడీసీసీ బ్యాంకు చైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి మరియు బ్యాంకు అధికారులు

# లక్ష్మినారాయణ మృతి వైసిపికి తీరని లోటు
## - మాజీ డిసిఎంఎస్ డైరెక్టర్ బొమ్మన శ్రీరామిరెడ్డి

శింగనమల, జులై 21 ప్రభాతవార్త

మండల పరిధిలోని నాయిన వారిపల్లి గ్రామానికి చెందిన వైసిపి నాయకులు లక్ష్మినారాయణ గుండెపోటుతో మృతి చెందాడు. ఆయన మృతి విషయం తెలుసుకున్న వైఎస్ఆర్‌సిపి మాజీ డిసిఎం డైరెక్టర్ బొమ్మన శ్రీరామిరెడ్డి వారి ఇంటికి వెళ్లి లక్ష్మినారాయణ భౌతిక కాయానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లక్ష్మినారాయణమృతి వైఎస్ఆర్‌సిపికి తీరని లోటని ఆయన పేర్కొన్నారు. అటువంటి నాయకున్ని పోగొట్టుకోవడం ఎంతో బాధాకరమన్నారు. వైఎస్ఆర్‌సిపి నాగలగుడ్డం గ్రామం దాసరి వెంకటరమణ తదితరులు నివాళులు అర్పించిన వారిలో ఉన్నారు.


లక్ష్మినారాయణ భౌతిక కాయానికి నివాళులు అర్పిస్తున్న దృశ్యం

# డీపీఓ నాగరాజుకు న్యాయం చేయాలి
## - బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు భాస్కర్‌బాబు

అనంతపురం కల్చరల్, జులై 21 ప్రభాతవార్త

అనంతపురం జిల్లా పంచాయతీ అధికారి నాగరాజునాయుడు ఈనెల 17వ తేదీన తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి వ్యక్తిగత దూషణలు చేయడం హేయమైన చర్య అని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు భాస్కర్‌బాబు పేర్కొన్నారు. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో అధికారులకు భాస్కర్‌బాబుతోపాటు బహుజన యువసేన రాష్ట్ర అధ్యక్షులు లాయర్ హరి తదితరులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ అధికారికి సంబంధించిన విధులను ఆటంకపరుస్తూ భౌతిక దాడులు కూడా సిద్ధపడటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. నాగరాజునాయుడుకు తగు న్యాయం చేయాలని, అధికారుల ఆత్మస్థైర్యం దెబ్బతీస్తూ మానసికంగా వేదనకు గురి చేస్తున్న ఇలాంటి సంఘటనలపై తక్షణమే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే మున్సిపల్ కచైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి తన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బిసి విద్యార్థి విభాగం అధ్యక్షుడు కేశవ్ కుమార్, నగర అధ్యక్షుడు భరత్ యాదవ్, వాల్మీకి ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు గంగాధర్, వైస్ ప్రెసిడెంట్ సుధాకర్, బీసీ సంఘం నాయకులు రమణ, లక్ష్మినారాయణ, సాకే హరి, డీకే రామలింగం తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలకు ప్రధాన సౌకర్యాలపై ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపండి
## తాలూకా పంచాయితీ కె డి పి సభలో ఎమ్మెల్యే బి.నాగేంద్ర

బళ్లారి, జులై 21 (ప్రభాతవార్త): వ్యవసాయం మరియు ఇతర శాఖల వివిధ పథకాల కింద సౌకర్యాలు, సామాగ్రి మరియు పరికరాలను ప్రజలకు పంపిణీ చేయడానికి ప్రభుత్వం లక్ష్యాన్ని నిర్దేశించే ముందు, సంబంధిత శాఖ అధికారులు ప్రజలకు ఏ సౌకర్యాలు అందించాలో ప్రభుత్వానికి ఒక ప్రతిపాదనను సమర్పించాలని బళ్లారి గ్రామీణ ఎమ్మెల్యే బి. నాగేంద్ర సూచించారు. నగరంలోని కోటే ప్రాంతంలోని తాలూకా పంచాయతీ కార్యాలయంలో సోమవారం జరిగిన బళ్లారి తాలూకా కర్ణాటక అభివృద్ధి కార్యక్రమాలు (20 అంశాలు సహా) యొక్క 1వ త్రైమాసిక కె డి పి ప్రగతి సమీక్ష సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. వివిధ శాఖల అధికారులు ప్రజలకు ఏ సౌకర్యాలు అందించాలో శ్రద్ధ వహించాలి. ప్రభుత్వం వద్ద డబ్బు లేదని ప్రజలు నమ్మకూడదు. ప్రభుత్వం వద్ద అవసరమైన నిధుల కంటే ఎక్కువ ఉంది. ప్రభుత్వం నిధులను విడుదల చేసే వరకు అధికారులు వేచి ఉండకూడదు. అధికారుల శాఖలకు ఏమి అవసరమో ప్రభుత్వానికి లేఖ రాయాలని ఆయన ఆదేశించారు.మా ప్రభుత్వం ప్రజలకు, అధికారులకు మధ్య వారధిగా పనిచేస్తోంది. మా ప్రభుత్వం అధికారులకు 100 శాతం మద్దతును అందిస్తోంది. ప్రజాప్రతినిధులమైన మేము ప్రభుత్వాన్ని సామాన్య ప్రజలకు చేరువ చేసే పనిని చేస్తామని ఆయన అన్నారు.ప్రస్తుత సంవత్సరంలో, బళ్లారి తాలూకా ప్రాంతంలో మొత్తం 515 లీతితి వర్షం డిమాండ్ ఉంది మరియు ఇప్పటివరకు మొత్తం 165 మి.మీ.వర్షం కురిసింది. 138మి.మీ.వర్షం (16 శాతం) కొరత ఉంది. రాబోయే రోజుల్లో వర్షాలు కురిసే అవకాశం ఉంది. బళ్లారి తాలూకాలో అవసరమైన విత్తనాలు మరియు ఎరువుల నిల్వ ఉందని వ్యవసాయ సహాయ సంచాలకులు సమావేశంలో తెలిపారు.


కె డి పి అధికారులు సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాగేంద్ర

# ఎమ్మెల్యే నాగేంద్ర చే 150 ద్విచక్ర వాహనాల పంపిణీ


లబ్ధిదారులకు మోటార్ సైకిళ్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బి నాగేంద్ర

బళ్లారి, జులై 21 (ప్రభాతవార్త): షెడ్యూల్డ్ కులాల సంక్షేమ శాఖకు చెందిన కర్ణాటక మహర్షి వాల్మీకి షెడ్యూల్డ్ తెగల అభివృద్ధి కార్పొరేషన్ సంవత్సరానికి మంత్రి ప్రత్యేక గ్రాంట్ కింద ద్విచక్ర వాహనాల పంపిణీ పథకం కింద ఎంపికైన 150 మంది లబ్ధిదారులకు బళ్లారి రూరల్ ఎమ్మెల్యే బి. నాగేంద్ర సోమవారం బళ్లారి తాలూకా పంచాయతీ కార్యాలయం ప్రాంగణంలో ద్విచక్ర వాహనాలను పంపిణీ చేశారు.తరువాత విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో ఐదు గ్యారెంటీ పథకాలను పూర్తిగా అమలు చేయడంతో పాటు అభివృద్ధి పనులకు కూడా ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా మన ప్రభుత్వం దేశంలోనే ఆదర్శవంతమైన ప్రభుత్వంగా నిలిచిందని అన్నారు.శక్తి, అన్నభాగ్య, గృహజ్యోతి, గృహలక్ష్మి, యువనిధి వంటి హామీ పథకాల ద్వారా ఏటా ప్రజలకు దాదాపు రూ. 62 వేల కోట్లు వెచ్చిస్తున్నట్లు చెప్పారు. ప్రజలకు అందించే గ్యారెంటీ యోజనలకు నిధుల కొరత లేదన్నారు.ఇటీవల విజయనగరం జిల్లాలో నిర్వహించిన సాధన సమావేశం కార్యక్రమం ప్రజలు మెచ్చిమరియు ప్రశంసించడం ఇందుకు నిదర్శనమని ఆయన అన్నారు. బళ్లారి జిల్లాలో అన్ని అభివృద్ధి పనులు సజావుగా జరుగుతున్నాయి. జిల్లాలో గంజాయి అక్రమ అమ్మకాలు మరియు జూదం అరికట్టడానికి, మా ప్రభుత్వం ఇప్పటికే ఖిగడపగడపకు పోలీస్‌ఖి అనే వినూత్న కార్యక్రమాన్ని ప్రారంభించింది, దీనిని జిల్లాలో దశలవారీగా అమలు చేయనున్నారు. మా ప్రభుత్వం సమాజంలోని అన్ని వర్గాలను ముందుకు తీసుకురావడానికి కృషి చేస్తోందని ఆయన అన్నారు.

# వైకాపా గజదొంగల పార్టీ

## ఆ పార్టీ నాయకులు అందరూ జైలుకెళ్లాల్సిందే  కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యం

## హోం మంత్రి అనిత



సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తున్న మంత్రులు

గుడిబండ జులై 21 ప్రభాతవార్త

రాష్ట్రంలో గత ఐదేళ్ల కాలంలో అవినీతి అరాచకం రాజ్యమేలిందని గత ప్రభుత్వంలో అవినీతి అక్రమాల్లో కోట్లాది రూపాయలను దోచుకున్నారని వైసిపి రాజకీయ పార్టీ కాదని అది ఒక గజదొంగల పార్టీ అని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత పేర్కొన్నారు. మండల కేంద్రమైన గుడిబండ లోసోమవారం జరిగిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవితతో కలిసి తొలుత స్థానిక బస్టాండ్ లోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం పార్టీ శ్రేణులతో ర్యాలీగా ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించి ప్రజల అభిప్రాయాన్ని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత మాట్లాడుతూ వైసీపీ హాయంలో ఆ పార్టీ నాయకులు కేవలం అక్ర మంగా దోచుకోవడం దాచుకోవడమే ధ్యేయంగా పనిచేశారని మాజీ ముఖ్య మంత్రి జగన్ ఒక గజదొంగ కాగా మంత్రులుగా పనిచేసిన ఆ పార్టీ నాయకులంతా దొంగల ముఠాగా ఏర్పడి కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని దోచుకున్నారని ఆమె ధ్వజమెత్తారు. కేవలం మద్యం కుంభకోణంలోనే 3500కోట్లు అవినీతి జరిగిందంటే మిగిలిన పథకాలలో అవినీతి ఏ స్థాయిలో జరిగిందో సులభంగా అర్థమవుతుం దన్నారు. రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత మాట్లాడుతూ రాష్ట్రంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ,విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ఆధ్వ ర్యంలో అభివృద్ధి పరుగులు పెడుతుందని అయితే వైసిపి నాయకులు అభివృద్ధికి ఆటంకం కలిగిస్తూ శవరాజకీయాలు చేయడం అత్యంత దుర్మా ర్గమని ఆపార్టీకి రాష్ట్రంలోని ప్రజలు తగిన బుద్ధి చెప్పి మంచి గుణపా ఠం నేర్పిన కూడా ఆ పార్టీ నాయ కులకు జ్ఞానోద యం కాలేదని ఆమె చలోక్తు లు విసిరారు. మడకశిర నియోజక వర్గంలో గతంలో ఎన్నడూ లేనివిధం గా అభివృద్ధి జరుగు తుందని వెనుక బడిన ఈ ప్రాంతానికి అనేక పరిశ్రమలు తీసుకొచ్చేం దుకు మడకశిర శాసనసభ్యుడు ఎంఎస్ రాజు విశేషంగా కృషి చేస్తున్నారని ఆమె కొనియా డా రు . ఈ కార్యక్రమంలో ఎమ్మె ల్యే ఎమ్మెస్ రాజు, మాజీ ఎంఎల్సీ గుండుమల తిప్పేస్వామి, రాష్ట్ర కార్య దర్శి డాక్టర్ శ్రీనివాసమూర్తి, టిడిపి జిల్లా అధ్యక్షుడు అంజన్నప్ప, మండల కన్వీనర్ లక్ష్మీనరసప్ప, ప్రధాన కార్యదర్శి శ్రీనాథ్ మూర్తి,సింగిల్ విండో అధ్యక్షుడు మద్దనకుంటప్ప, డైరెక్టర్ ప్రకాష్,కెఎన్ పల్లి సురేష్, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు మంజునాథ్, టిడిపి నాయకులు లాయర్ శివకుమార్, శశిధర్, దుర్గేష్, షబ్బీర్,బాలేపల్లిరాజు ,భీమరాజు, చిత్రశేఖర్, భోజరాజు, నజీర్,లక్ష్మీనారాయణ,పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

# నియోజకవర్గ అభివృద్ధే మన లక్ష్యంగా ముందుకు సాగుతున్నాం.

## మన్నీల గ్రామంలో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమం లో ఎమ్మెల్యే పరిటాల సునీత.



మహిళలకు సూపరి పాలన తొలి అడుగు కరపత్రాలు అందజేస్తున్న దృశ్యం.

అనంతపురం రూరల్, జులై 21 ప్రభాతవార్త

రాప్తాడు నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తున్నామని ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. అనంతపురం రూరల్ మండలం మన్నీల గ్రామం లో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ముందుగా గ్రామంలో 20లక్షల ఎన్ఆర్ఈజీఎస్, మండల నిధులతో నిర్మించిన సీసీ రోడ్లను ప్రారంభించారు. అనంతరం ఇంటింటికీ వెళ్తూ ఏడాది కాలంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. తల్లికి వందనం, గ్యాస్ సిలిండర్లు, పింఛన్లు వంటి పథకాలు అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు. తమకు పథకాలన్నీ అందుతున్నాయని గ్రామస్థులు తెలిపారు. కొన్ని చోట్ల ముగ్గురు పిల్లలు ఉన్నా తమకు పథకాలు అందాయన్నారు. అలాగే గ్రామంలో కొన్ని సమస్యలను కూడా ఎమ్మెల్యే సునీత దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ మన్నీల గ్రామంలో సంక్షేమ పథకాలు ఎంత మందికి అందా యన్నది వివరించారు. 6.39లక్షలతో మూడు గోకులం షెడ్స్, 8మందికి 9లక్షల సబ్సిడీతో స్ప్రింకర్లు, డ్రిప్పు అందజేసినట్టు చెప్పారు. ఐకేపీ ద్వారా డ్వాక్రా మహిళా సంఘాలకు 39లక్షల మేర రుణాలు ఇచ్చినట్టు చెప్పారు. అనంత పురం రూరల్ మండలంలో రికార్డు స్థాయిలో 13కోట్లతో రోడ్లు నిర్మించినట్టు చెప్పారు. 17,504 మందికి సంవత్సరానికి 94.22 కోట్ల రూపాయల మేర పింఛన్లు అందించా మన్నారు. 64 మందికి 64 లక్షలు ముఖ్యమంత్రి సహాయనిధికి అంది ంచినట్టు చెప్పారు. 49.57 కోట్లతో 33, 361 గృహా లకు కొళాయి కనెక్షన్లు అందజేసి నట్టు చెప్పారు. 18,934 మందికి తల్లికి వందనం కింద 24.61 కోట్ల రూపాయలు అందజేసినట్టు వివరించారు. ఒక్క ఏడాదిలో ఇంత అభివృద్ధి సంక్షేమం చేసి చూపించామన్నారు. గత ఐదేళ్లకి ఇప్పటికీ తేడా గమనిం చాలని ఎమ్మెల్యే సునీత విజ్ఞప్తి చేశారు. కేవలం అభివృద్ధి, సంక్షేమ పథకా లు మాత్రమే కాకుం డా పెద్ద ఎత్తున పరిశ్ర మలు తీసుకూరావాలన్న లక్ష్యంతో పని చేస్తున్నా మన్నారు. ఈ కార్యక్రమం లో గ్రామ సర్పంచ్ త్రిలోక నాథ్, మండల కన్వీనర్ సూర్యనారాయణ, క్లస్టర్ ఇంచార్జ్ పాము రాయి రఘు, మాజీ జెడ్పిటిసి వేణుగోపాల్, మండల స్థానిక నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# డీటీడబ్ల్యూవోగా శ్రీనివాసరావు బాధ్యతలు స్వీకరణ



ఇన్‌ఛార్జ్ కలెక్టర్‌కు పుష్పగుచ్చం అందజేస్తున్న డీటీడబ్ల్యూవో శ్రీనివాసరావు



నూతన డీటీడబ్ల్యూవోకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఉద్యోగులు

అనంతపురం న్యూటౌన్, జూలై 21 ప్రభాతవార్త

జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి (డీటీడబ్ల్యూవో) ఎం.శ్రీనివాసరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పనిచేస్తున్న డీటీడ బ్ల్యూవో వి.రామాంజినే యులును తన మాతృశాఖ పంచాయతీ రాజ్‌శాఖకు సరెండ్ చేస్తూ గత నెల 16న గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్ భార్గవి ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన స్థానంలో అల్లూరు సీతారా మరాజు జిల్లా అనంతగిరి ఏటీడబ్ల్యూవోగా పనిచేస్తున్న ఎం. శ్రీనివా సరావుకు డీటీడబ్ల్యూవో (ఎఫ్ఏసీ)గా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ డైరెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. అందులో భాగం గా ఆయన కొన్ని కారణాల వలన 35 రోజుల తర్వాత (ఆది వారం) జిల్లా కేంద్రానికి చేరుకున్నారు. సోమవారం ఉదయం 10ః30 గంటలకు మొదట ఇన్‌ఛార్జ్ జిల్లా కలెక్టర్ శివ్ నారా యణ్‌శర్మను మర్యాద పూర్వకంగా కలిసి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా నూతన డీటీడబ్ల్యూవోకు తాజా మాజీ డీటీడబ్ల్యూవో , పర్యవేక్షకులు సురేష్, సిబ్బంది కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. అలాగే తాజా మాజీ డీటీడబ్ల్యూవో రామాంజి నేయులును కూడా జిల్లా కార్యాలయం ఉద్యోగులు సన్మానం చేశా రు. తాజా మాజీ డీటీడబ్ల్యూవో సోమవారం రాత్రి విజయవాడకు బయలు దేరి మంగళవారం తన మాతృశాఖలో రిపోర్టు చేసుకోనున్నారు. ఈ సందర్భంగా నూతన డీటీడ బ్ల్యూవో మాట్లాడుతూ...తాను అనంతపురం జిల్లా కేంద్రంలోని సరస్వతి విద్యానికేతన్ లో బీఈడీ పూర్తి చేశానని, తనకు ఈ జిల్లా పట్ల అవగాహన ఉందన్నారు. జిల్లా కార్యాలయం ఉద్యోగులు, వార్డెన్లు, ప్రిన్సి పాల్స్, ప్రజా సంఘాలు, పాత్రికే యుల సహకాంతో జిల్లాను అభివృద్ధిలో ముందుకు తీసుకెళ్తానని తెలిపారు. అందుకు ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు.

**నూతన డీటీడబ్ల్యూవో ఉద్యోగ ప్రస్థానం ః** మన్యం జిల్లా గుమ్మలక్ష్మీపురంకు చెందిన ఎం.శ్రీనివాసరావు 1991లో డీఎస్సీ పరీక్ష వ్రాసి గిరిజన సంక్షేమ శాఖలో వార్డెన్‌గా ఎంపికై పార్వతిపురంలోని గిరిజన ఆశ్రమం పాఠశాలలో మొదటి సారి ఉద్యోగంలో జాయిన్ అయ్యారు. 2019 లో గ్రేడ్-1 వార్డెన్‌గా పదోన్నతి పొంది పార్వతి పురంకు బదిలీ అయ్యారు. ఆ తర్వాత సొంత ఊరు అయిన గుమ్మలక్ష్మి పురంకు బదిలీ అయ్యారు. 2013లో ఏటీడబ్ల్యూవోగా పదోన్నతి పొంది పాడేరుకు బదిలీ అయ్యారు. ఆ తర్వాత 2008లో మందసకు బదిలీ అయ్యారు. ఆ తర్వాత సీతంపేట ఐటీ డీఏ ప్రాజెక్టు డీడీగా ఆరు నెలలు పనిచేశారు. ఆ తర్వాత అనంతగిరి ఏటీడ బ్ల్యూవోగా బదిలీ అయ్యారు. అక్కడ దాదాపు రెండు వారాలు పనిచే శారు. ఆ తర్వాత అనంతపురం జిల్లా డీటీడబ్ల్యూవో (ఎఫ్ఏసీ)గా బదిలీ చేస్తూ డైరెక్టర్ ఉత్తర్వులు జారీ చేయడంతో సోమవారం బాధ్యతలు స్వీకరించారు. 36 ఏళ్ల సర్వీసు అనుభవం వుంది. ఇంకా ఐదేళ్ల సర్వీసు వుంది.

# మున్సిపల్ కౌన్సిల్ సమావేశాలను నిర్వహించేందుకు చేతకాకపోతే రాజీనామా చేసి తప్పుకోండి

## టిడిపి మహిళా కౌన్సిలర్ల డిమాండ్  - వై సి పి చైర్మన్ కౌన్సిలర్లు లేకుండానే మున్సిపల్ కౌన్సిల్ సమావేశం



మున్సిపల్ కౌన్సిల్ సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం



సమావేశంలో మాట్లాడుతున్న మహిళ టిడిపి కౌన్సిలర్లు



మున్సిపల్ చైర్మన్ పై పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న దృశ్యం

కళ్యాణదుర్గం, జూలై 21 ప్రభాతవార్త :

కళ్యాణదుర్గం మున్సిపల్ కౌన్సిల్ సమావేశం మున్సిపల్ చైర్ పర్సన్ వైసిపి కౌన్సిలర్లు లేకుండానే కేవలం టిడిపి కౌన్సిలర్లతోనే నిర్వహించిన సంఘటన కళ్యాణదుర్గం మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో చోటుచేసుకుంది. వైయస్ కాంగ్రెస్ పార్టీకి పూర్తి మెజారిటీ తో పాలకవర్గం ఉన్నా రాజకీయ కారణాలతో వారు పాలకవర్గ బాధ్యతల నుండి తప్పుకున్నట్లు తెలుస్తోంది. ప్రతి నెల మున్సిపల్ కౌన్సిల్ సమావేశం నిర్వహించి మున్సిపాలిటీలో పలు అభివృద్ధి కార్యక్రమాలపై తీర్మానాలు చేసి వాటిని అమలు చేయవలసిన బాధ్యతలను పాలకవర్గం నిర్వహించాల్సి ఉంది. అయితే తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చాక బోటా బోటిగా ఒక సమావేశాన్ని టిడిపి ఎమ్మెల్యే సురేంద్రబాబు చొరవతో నిర్వహించాల్సి వచ్చింది. మరల కౌన్సిల్ సమావేశం నిర్వహించలే కపోవడం తో మున్సిపాలిటీలో అభివృద్ధి పనులు ఎక్కడికక్కడ ఆగిపోయాయి. మున్సిపాలిటీకి రూ. 7 కోట్ల నిధులు మంజూరు అయిన వాటిని ఉపయోగించుకునే పరిస్థితి లేకపోవడం గమనార్హం. ఈ నేపథ్యంలో మున్సిపల్ కమిషనర్ వంశీకృష్ణ భార్గవ్, పలువురు మున్సిపల్ కౌన్సిలర్లు చైర్మన్ రాజ్ కుమార్ సంప్రదించేందుకు పలుమార్లు ప్రయత్నించిన స్పందిం చకపోవడం, మున్సిపల్ కార్యాలయం నుండి నోటీసులు పంపిన తిరస్కరిం చడం వల్ల చైర్మన్ పదవికి దూరంగా ఉంటున్నట్లు పాలకవర్గం ఆరోపిస్తోంది. చివరకు జిల్లా కలెక్టర్ ఫోన్ చేసిన చైర్మన్ స్పందించకపోవడంతో సమావేశా లు నిర్వహణకు తీవ్ర అడ్డంకిగా మారింది. ఈ నేపథ్యంలో సోమవారం కళ్యాణ దుర్గం మున్సిపల్ సమావేశ భవనంలో పాలకవర్గ సమావేశాన్ని నిర్వహించారు. నిబంధనలకు మున్సిపల్ చట్టానికి అనుగుణంగా ప్రస్తుత మున్సిపల్ చైర్మన్ రాజ్ కుమార్కు పలుమార్లు ఫోన్ చేసినా తీయకపో వడంతో అరగంట వ్యవధి ఇచ్చి చివరకు టిడిపి వైస్ చైర్మన్ తిమ్మప్పను సభాధ్యక్షులుగా చేసి 24 మంది సభ్యులలో 11 మంది హాజరు కావడంతో 1/3 మెజారిటీతోనే అధికార వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు 13 మంది లేకుండానే కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహించాల్సి వచ్చింది. ఈ సందర్భంగా కళ్యాణదుర్గం మున్సిపాలిటీలో మూడు కోట్ల నిధులతో 31 పనులు చేపట్టేం దుకు తీర్మానాన్ని ఆమోదించారు. ప్రధానంగా వార్డుల్లో సీసీ రోడ్లు డ్రైనేజీలు నిర్మాణానికి తీర్మానాన్ని ఆమోదించారు. అనంతరం టిడిపి కౌన్సిలర్లు విలేకరుల సమావేశం నిర్వహించి కౌన్సిల్ తీర్మానాలు లేకపోవడంతో ఉన్న నిధులు కూడా ఖర్చు పెట్టలేని పరిస్థితుల్లో ప్రజలకు సౌకర్యలేవి కల్పించలేకపోత ున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. చైర్మన్గా ఉన్న రాజ్కుమార్ ఆయన నేతృత్వంలోని పాలకవర్గం కౌన్సిల్ సమావేశాలు నిర్వహించకుండా మృతి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నందున మున్సిపాలిటీ అభివృద్ధి పనులు ముందుకు సాగడం లేదని విమర్శించారు. ప్రజలకు సౌకర్యాలు కల్పించలేని స్థితిలో ఉన్న పాలకవర్గం మున్సిపల్ చైర్మన్ రాజ్కుమార్ రాజీ నామా చేసి తప్పుకోవాలని డిమాండ్ చేశారు. కళ్యాణ్ దుర్గం మున్సిపాలిటీ పరిధిలో చాలా వార్డుల్లో తాగునీరు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వీధి దీపాలు డ్రైనేజీలు సిమెంట్ రోడ్లు లేక ప్రజలు తీవ్ర విమర్శలు చేస్తున్నారన్నారు. ప్రజలకు బాధ్యతగా ఉండాల్సిన పాలకవర్గం నిర్లక్ష్యం కారణంగానే మున్సిపాలిటీ అధ్వానంగా మారిందని వాపోయారు. కనుక చైర్మన్గా తన విధులను నిర్వహించలేకపోతున్న రాజ్ కుమార్ ఆ పదము నుండి తప్పుకోవాలని డిమాండ్ చేశారు. అంతేకాకుండా కార్యాలయ సిబ్బందికి ప్రజలకు అందుబాటులో లేకుండా తప్పిపోయిన రాజ్ కుమార్ ను వెతికి ఇవ్వాలని స్థానిక పట్టణ పోలీసు స్టేషన్లో సీఐ యువరాజుకు లిఖితపూర్వక ఫిర్యాదు చేయడం గమనార్హం. ఈ కార్యక్రమంలో మహిళా టిడిపి కౌన్సిలర్లు మహాలక్ష్మి, అనిత, శర్మస్ వలి తదితరులు పాల్గొన్నారు

# వైసిపి యువజన విభాగం నాయకుడు అనిల్‌కుమార్‌గౌడ్ హౌస్ అరెస్ట్

అనంతపురం సిటి, జులై 21 ప్రభాతవార్త

వైసిపి యువజన విభాగం నాయకుడు అనిల్‌కుమార్‌గౌడ్‌ను ఆదివారం అర్ధరాత్రి పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. మడకశిరకు వెళ్లకుండా ఆంక్షలు విధించారు. రాప్తాడు నియోజకవర్గంలోని రామగిరి మండలం ఏడుగుర్రాలపల్లిలో సామూహిక లైంగిక దాడికి గురైన దళిత బాలిక అనంతపురం సర్వజనాస్పత్రిలో మూడు రోజుల క్రితం మగబిడ్డకు జన్మనిచ్చింది. ఆమెకు న్యాయం చేయాలని వైసిపి నేతల డిమాండ్ చేస్తున్నారు. ఈ క్రమంలోనే మడకశిర పర్యటనకు వస్తున్న హోంమంత్రి అనితను అడ్డుకోవాలన్న ప్రయాణంలో వున్న యువజన విభాగం నాయకులు అనిల్‌కుమార్‌గౌడ్‌ను ఆదివారం అర్ధరాత్రి పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు.

# అట్టహాసంగా పిఏసిఎస్ అధ్యక్షుని ప్రమాణ స్వీకారం

## - కష్టపడ్డ వారిని తగిన గుర్తింపు  - జనసంద్రంగా మారిగి ఓడీచెరువు

## - పాల్గొన్న ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి



మాజీ మంత్రి పల్లె, సొసైటీ అధ్యక్షుడు మహబూబ్ బాషలను గజమాలతో సత్కరిస్తున్న అభిమానులు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సింధూర

ఓబుళదేవరచెరువు, జూలై 21, ప్రభాతవార్త : ఓడీచెరువు వ్యవసాయ పరపతి సంఘం అధ్యక్షుడు తుమ్మల మహబూబ్ బాష ప్రమాణస్వీకారం అట్టహాసంగా జరిగింది. స్థానిక పిఏసిఎస్ గోధాములో సోమవారం ఏర్పాటు చేసిన ప్రమాణస్వీకార మహోత్సవానికి పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూ రరెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డిలు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే సింధూరరెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునా థరెడ్డిలపై పూల వర్షం కురిపించి అపూర్వస్వాగతం పలికారు. ఓడీచెరువు పురవీధుల గుండా అంబేద్కర్ సర్కిల్ మీదుగా సొసైటీ కార్యలయం వరకూ ఊరేగింపు నిర్వహించారు. సౌమ్యుడు, నిరాడంబరుడు, సేవాపరుడు కావడంతో ఆయన ప్రమాణ స్వీకారోత్సవానికి బంధువులు, స్నేహితులు, టిడిపి నాయకులు కార్యకర్తలు తండోపతండాలుగా రావడంతో ఓడీచెరువును జనసంద్రంగా మారింది. బ్యాంకు సిఈఓ వెంకటాచలం సహకారం సంఘం అధ్యక్షులు మహబూబ్ బాష, డైరక్టర్లు శంకర, ముసల్‌రెడ్డి(ముని)లతో ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి మాట్లాడు తూ...తెలుగుదేశం పార్టీలో కష్టపడ్డ ప్రతి కార్యకర్తకు తగిన గుర్తింపు ఉంటుందన్నారు. ఇందుకు ఉదాహరణ తుమ్మల మహబూబ్ బాష అన్నారు. పార్టీ అభివృద్ధికి అంకిత భావంతో పనిచేసి అందరి మనన్నలు పొందాడన్నారు. ఆయన సేవలకు గుర్తింపుగానే సహకార సంఘం అధ్యక్షుని పదివి పొందారన్నారు. టిడిపి నాయకులను ఉత్పత్తి చేసే పరిశ్రమ అన్నారు. అనంతరం మాజీ మంత్రి రఘునాథరెడ్డి మాట్లాడుతూ...బడుగు బలహీన, మైనార్టీ వర్గాలకు అధిక ప్రాధాన్యం టిడిపిలోనే ఉందన్నారు. అన్ని వర్గాలకు సముచిత స్థానం ఉందన్నారు. కష్టపడ్డ ప్రతి కార్యకర్తను టిడిపి అక్కున చేర్చుకుని వారి కష్టనష్టాల్లో పాలుపంచుకుంటుందన్నారు. దేశ చరిత్రలో కోటి సభ్యత్వం ఒక్క టిడిపికి మాత్రమే ఉందన్నారు. కనుక ప్రతి ఒక్కరూ కష్టపడి పనిచేయాలని సూచించారు. అనంతరం నూతన అధ్యక్షుడు తుమ్మల మహబూబ్ బాష, డైరక్టర్లు గొర్ల శంకరయ్య, ముసల్‌రెడ్డి( ముని) లను శాలువలు, పూలమాలతో ఘనంగా సన్మానించారు. ఈ సమావేశ ంలో కన్వీనర్ జయచంద్ర, జడ్పీటిసి మాజీ సభ్యుడు పిట్టా ఓబుళరెడ్డి, మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు పిట్టా ప్రభాకర్‌రెడ్డి, జోనల్ ఫైవ్ ఇంచార్జ్ ఎల్ఐసి నరసింహులు, అడ్వకేట్ రాజశేఖర్, అల్లాపల్లి సింగిల్ విండో అధ్యక్షుడు శివారెడ్డి, మార్కెట్ యార్డ్ మాజీ ఛైర్మెన్ క్రిష్ణమూర్తి, అమడగూరు సింగిల్ విండో అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి, నాయకులు బ్రహ్మానందరెడ్డి, డాక్టర్ జాకీర్ అహ్మద్, ఇడగుట్ట ఆంజనేయులు, ఎమ్మార్ గంగాద్రి, బాలక్రిష్ణారెడ్డి, ఇర్షాద్, చన్నకేశవులు, సంగాల శ్రీనివాసులు, జెరిపిటి ప్రసాద్, డీలర్ షమూన్, జయచంద్రారెడ్డి, చౌట కిష్టప్ప, మాజీ సర ్పంచ్ షఫీ, మాజీ కన్వీనర్ రాజారెడ్డి, సుభాషిణి, సాకివేల శ్రీనివాసులు, రఘునాథరెడ్డి, నారపరెడ్డితో పాటు నాయకులు కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

# "భగవా" దానిమ్మ భలే దిగుబడి..!!

## - ఏడాది కాలంలో ఒకటిన్నర ఎకరాలో 650 మొక్కలు, 13 టన్నుల దిగుబడి, రూ.15 లక్షల రాబడి

## - గోరంట్ల మండలం రాగిమేకలపల్లి ఆదర్శరైతు గంగాధర్‌రెడ్డి పొలంలో సిరులు కురిపిస్తున్న దానిమ్మపంట -

## మేలి రకం మొక్కల ఎంపిక, సస్యరక్షణతో సాగు విధానంపై రైతును ఇది వరకే అభినందించిన జిల్లా అధికారులు



దిగుబడిని చూపిస్తున్న ఆదర్శ రైతు గంగాధర్‌రెడ్డి



దానిమ్మ పంట దిగుబడిని పరిశీలిస్తున్న జిల్లా అధికారులు



చెట్టు నిండా కాయలు ఉన్న దానిమ్మ పంట

గోరంట్ల, జూలై 21 ప్రభాతవార్త

365 రోజులపాటు సాగు చేస్తున్న దానిమ్మ పంటను కంటికి రెప్పలా కాపాడుకుంటూ మేలి రకం కాయల అధిక దిగుబడి సాధిస్తున్న ఆదర్శ రైతు గంగాధర్‌రెడ్డిని జిల్లా అధికారు లు అభినందిస్తున్నారు. పండ్ల తోటల పెంప కంలో మంచి మెలకువలు, ఆ పంటలపై శ్రద్ధ, మేలి రకం వంగడాల ఎంపిక వంటి విషయాల్లో ఆదర్శ రైతు గంగాధర్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ వహించి ఇటు పండ్ల తోటల్లోను అటు వేరుశనగ, మొక్కజొన్న, నాటి కోళ్ల పెంపకం, గొర్రెల పెంపకం వంటి వాటిపై శ్రద్ధ చూపుతూ వాటిలో అధిక లాభాలు సాధిస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నాడు ఆదర్శరైతు గంగాధర్‌రెడ్డి. పండ్ల తోటల పెంపకంలో భాగంగా గంగాధర్‌రెడ్డి గత ఏడాదిన "భగవా రెడ్డు" అని మేలు రకం దానిమ్మను తన వ్యవసాయ క్షేత్రంలో ఒకటిన్నర ఎకరాలో ఎకరాకు 400 చొప్పున మొక్కలను నాటారు.

అయితే మొదట సాగుచేసిన మొదటి ఏడాదిలో వచ్చిన దిగుబడి ఆదాయంలో సస్య రక్షణకు పెట్టుబడులకు దాదాపుగా సరిపోయిందని, రెండో విడత క్రాపులో ఒకటిన్నర ఎకరాకు దాదా పుగా 3 లక్షల వరకు ఖర్చు అయిందని మార్కెట్‌లో ప్రస్తుతం ఒక టన్నుకు దాదాపు 1.50 లక్షల వరకు ధర పలుకుతోందని సాగు చేసిన ఒకటిన్నర ఎకరాల్లో దాదాపు 13 టన్నులకు పైగా దిగుబడి వచ్చిందని తద్వారా పెట్టుబడి పోను దాదాపు 15 లక్షల దాకా ఆదాయం చేకూరిందని రైతు ఆనందం వ్యక్తం చేశారు.

**జిల్లా అధికారుల ప్రశంసలు :** గోరంట్ల మండలంలోని రాగిమేకలపల్లికి చెందిన ఆదర్శ రైతు గంగాధర్‌రెడ్డి సాగు చేస్తున్న పండ్ల తోటలతో పాటు పలు రకాల పంటలు సాగు చేస్తున్న విధానం చేపడుతున్న సస్యరక్షణ వంటి వాటిని క్షేత్రస్థాయిలో సంబంధిత జిల్లా అధికారులు పరిశీలించి ఆ రైతును అభినందించడం విశేషం.

# అపహాస్యం..సర్వసభ్య సమావేశం..!

## ః హాజరు అంతంతమాత్రమే..అంతా వారిష్టమే..! ః అధికారులు పట్టించుకోరు..ప్రజాప్రతినిధులకు పట్టదు..!



సర్వసభ్య సమావేశంలో 11.15 గంటలైనా కనిపించని అధికారులు



11 గంటలు దాటినా అరకొరగా హాజరైన అధికారులు, ప్రజాప్రతినిధులు



ప్రజాప్రతినిధుల పట్ల అధికారుల నిర్ల క్ష్యాన్ని ఎండగడుతున్న సర్పంచి సంజీవరాయుడు

యాడికి(తాడిపత్రి), జులై 21, ప్రభాతవార్తః మండల పరిధిలోని 37 గ్రామాలకు చెందిన దాదాపు 67 వేల మంది ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొని వచ్చి పరిష్కరించడానికి 14 మంది సర్పంచులు, 16 మంది ఎంపీటీసీ సభ్యులు మూడు నెలలకు ఒకసారి సమావేశమయ్యే సర్వసభ్య సమావేశం అపహాస్యంగా మారుతోంది. అంతా మా ఇష్టమే అన్నట్లు అధికారులు గైర్హాజరవడం, ప్రజాప్రతినిధులు పట్టింపులేకుండా వ్యవహరించడంతో సుదీర్ఘంగా చర్చ జరగాల్సిన ఈ సమావేశాన్ని గంటన్నరలోనే మమ అనిపిస్తున్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో సోమవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశం ఇందుకు ప్రత్యక్ష నిదర్శనంగా నిలిచింది. 10 గంటలకు ప్రారంభమవ్వాల్సిన సర్వసభ్య సమావేశం 11.15 గంటలైనా ప్రజాప్రతినిధులు గాని, మండల స్థాయి అధికారులు గాని రాకపోవడంతో నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపించింది. అధికారులు కనీసం వేదిక మీద ఉన్న సూచిక బోర్డులో తేదీని కూడా మార్చ కపోవడం గమనార్హం. ఇక 11.20 గంటలకు ప్రారంభమైన ఈ సమావేశాన్ని 12.45 గంటలకు మమ అనిపించారు. ఉపాధి హామీ పనులు చేపడుతు న్నప్పుడు సంబంధిత పంచాయతీ సర్పంచి దృష్టికి తీసుకొని రావాలనే బాధ్యత అధికారులకు లేకపోవడం పట్ల, ఇనామ్, బంజరు, డి.పట్టాల్లో భూములు కలిగిన రైతులకు అన్నదాత సుఖీభవ వర్తింపుకు నిబంధనల అడ్డంకి పైనా, తల్లికి వందనం లబ్ధిదారులకు పూర్తిస్థాయి సొమ్ము అందకపో వడం పట్ల, సర్పంచుల వేతనాలు అందకపోవడం, ఆర్టీసీ బస్సుల నిర్లక్ష్య వైఖరి పట్ల తూట్రాళ్లపల్లి సర్పంచి సంజీవరాయుడు సంబంధిత అధికారులను నిలదీశారు. బోయరెడ్డిపల్లిలో చాలా కాలంగా స్థానికులు ఉప యోగించు కుంటున్న కల్లం దొడ్లను దౌర్జన్యంగా కొందరు తొలగించిన రెవె న్యూ అధికారులు పట్టించుకోకపోవడంపై ఉప ఎంపీపీ చెన్నప్ప సమావేశంలో ప్రస్తావించగా తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్‌లు గైర్హాజరవడంతో విషయం తెలియని ఆర్ఐ నీళ్లు నమలాల్సి వచ్చింది. గత సమావేశాల్లో ప్రస్తా వించిన సమస్యలపై సంబంధిత అధికారులు స్పందిచనందుకు నిరసనగా ఉప ఎంపీపీ చెన్నప్ప సమావేశం నుంచి మధ్యలోనే నిష్క్రమించారు. ఎంపీపీ ఉమాదేవి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి సర్పంచులు దేవేంద్ర, కంబగిరి స్వామి, ఎంపీటీసీ సభ్యులు వెంకట నాయుడు, రాగుల పార్వతి, నాగమణి,రామాంజినమ్మ, ఎంపీడీవో వీరరాజు, ఎంఈవో కాశప్ప, ఏవో మహబూబ్ బాషా, విద్యుత్తు ఏఈ విజ యుడు, హౌసింగ్ ఏఈ లోకేష్, మండల ఇంజనీరు వరప్రసాద్, ఆర్‌డ బ్ల్యూఎస్ ఏఈ దేవకుమార్, ఏపీఎం చంద్రశేఖర్, ఏపీవో మద్దిలేటి, పశుసం వర్ధక శాఖ వైద్యులు విజయలక్ష్మి, ఐసీడీఎస్ విజయకుమారి తదితరులు పాల్గొన్నారు. మండల స్థాయి రెవెన్యూ, వైద్య, అటవీ, రోడ్లు భవనాలు, జలవనరులు, రిజిస్ట్రేషన్, పోలీసు శాఖల అధికారులతో పాటు రెండో ఉప ఎంపీపీ, యాడికి, రాయలచెరువు, చందన, లక్షుంపల్లి, కోనుప్పలపాడు, వేములపాడు, నిట్టూరు, చిక్కేపల్లి, గుడిపాడు, నగరూరు, వెంగన్నపల్లి సర్పంచులు,11 మంది ఎంపీటీసీ సభ్యులు కూడా గైర్హాజరవడం విశేషం.

# ప్రజా సమస్యల పరిష్కార వేదిక అర్జీలను నాణ్యతగా పరిష్కరించాలి

## - ఇన్‌చార్జ్ జిల్లా కలెక్టర్ శివ్‌నారాయణ్‌శర్మ



అర్జీలను స్వీకరిస్తున్న ఇన్‌చార్జ్ కలెక్టర్, అధికారులు

అనంతపురం కలెక్టరేట్, జులై 21 ప్రభాతవార్త

అనంతపురం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవనంలో సోమవా రం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి జిల్లాలోని వివిధ మండలాల నుండి వివిధ రకాల సమస్యలతో వచ్చిన అర్జీదారుల నుండి ఇన్‌చార్జ్ జిల్లా కలెక్టర్ శివ్‌నారాయణ్‌శర్మ అర్జీలను స్వీకరించారు. ఇన్‌చార్జ్ జిల్లా కలెక్టర్‌తో పాటు అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహార్, జిల్లా రెవెన్యూ అధికారి ఏ.మలోల, ఫారెస్ట్ సెటిల్మెం ట్ అధికారి జి.రామకృష్ణారెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు తిప్పేనాయక్, ఆనంద్, రామ్మోహన్, మల్లికార్జునుడు, జిల్లా వ్యవసాయశాఖ అధికారి ఉమామహేశ్వరమ్మ, తదితరులు ప్రజల నుండి 612 అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదిక అర్జీలను నాణ్యతగా పరిష్కరించాలని ఆదేశించారు. పిజిఆర్ఎస్‌పై సిఎంఓ స్థాయి నుండి మానిటర్ చేయడం జరుగుతోందని, అర్జీలకు నాణ్యమైన ఎండార్స్‌మెంట్ అందించాలన్నారు. మండల స్థాయిలో కూడా పిజిఆర్ఎస్ ద్వారా అందిన ఫిర్యాదులపై క్షేత్రస్థాయిలో విచారణ జరిపి దరఖాస్తుదారునికి నాణ్యమైన పరిష్కారం చూపించాల న్నారు. బియా ండ్ ఎస్ఎల్ఏలోకి వెళ్లకుండా గడువులోపే పెండింగ్ లేకుండా పరిష్కరి ంచాలని అధికారులకు సూచించారు. ఎక్కడ కూడా ఫిర్యాదుదారులకు ఎండార్స్‌మె ంట్లు అందడం లేదనే ఫిర్యాదులు రాకుండా చూడాలని ఆదేశించారు. ఆర్డీఓలు, మున్సిపల్ కమీషనర్లు, తహశీ లార్లు, ఎంపిడిఓలకు సంబంధిం చిన ఫిర్యాదులపై దృష్టిని సారించి సత్వరమే వాటి పరిష్కారానికి కృషి చేయాలని తెలిపారు. అలాగే సిఎమ్ఓ, ఎంపి, ఎంఎల్‌సి, ఎమ్మెల్యేల ద్వారా సంబంధిత శాఖలకు వచ్చిన ఫిర్యాదు లపై వెంటనే స్పందిస్తూ ఎప్పటికప్పుడు సమస్యలను పరిష్కరించా లన్నారు. పిజిఆర్ఎస్ తో పాటు మండల స్థాయిలో వివిధ ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకర ణ, రెవెన్యూ సేవలు, రీ సర్వే పనులను ఆయా గ్రామాల్లో వేగవంతం చేసి పూర్తి చేయాలన్నారు. ముఖ్యంగా పి4 మార్గదర్శకుల పెండింగ్ పనులను పూర్తిస్థాయిలో నివేదించాలన్నారు. డిఆర్ఓ మలోలా మాట్లాడుతూ ప్రస్తుత వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, జిల్లాలో వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సంబం ధిత శాఖ అధికారులు ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పి సిఇఓ శివశంకర్, సిపిఓ అశోక్‌కుమార్, డిపిఓ నాగరాజునాయుడు, డిఆర్‌డిఏ పిడి శైలజ, డిఎంహెచ్ఓ డాక్టర్ ఈబి.దేవి, జిల్లా సైనిక్ సంక్షేమ శాఖ అధికారి పి.తిమ్మప్ప, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈ సురేష్, హౌసింగ్ పిడి శైలజ, డిటిసి వీరరాజు, డిఎండబ్ల్యుఓ రామ సుబ్బా రెడ్డి, సర్వే ఏడి రూప్లనాయక్, డివిఈఓ వెంకట రమణనాయక్, మైన్స్ డిడి ఆదినారాయణ, డ్వామా పిడి సలీంబాష, ఏపిఎం ఐపి పిడి రఘునాథరెడ్డి, జిజిహెచ్ అడ్మినిస్ట్రేటర్ మల్లికార్జున, జిజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఆత్మారావు, ఎన్టీఆర్ వైద్య సేవ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ కిరణ్‌కుమార్‌రెడ్డి, డిఈఓ ప్రసాద్‌బాబు, బిసి వెల్ఫేర్ డిడి కుష్బూ కొఠారి, ఏపిఎస్‌పిడిసిఎల్ ఎస్ఈ శేషాద్రిశేఖర్, కలెక్టరేట్ సెక్షన్ల సూపరింటెండెంట్లు యుగేశ్వరిదేవి, వసంతలత, రియాజుద్దీన్, పిజిఆర్ఎస్ తహశీల్దార్ వాణిశ్రీ, ఆయా శాఖల జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయి అధికారులు, తదితరులు పాల్గొన్నారు.